ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 5, జూలై 2025




డిప్యూటీ సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, జేసీ

వలసల్లేని ప్రకాశం లక్ష్యం

ప్రతి పల్లెకూ తాగునీటిని అందించడం మా విధి

- గత పాలకుల తీరుతో తీవ్ర నష్టం
- వెలిగొండను పూర్తిచేస్తాం
- యువతకు ఉపాధి కల్పిస్తాం
- ఇక్కడి కరువును చూసీ రాష్ట్ర వ్యాప్తంగా పశువుల తొట్టెలు
- రూ.1,290 కోట్ల తాగునీటి పథకానికి శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జిల్లాతో అనుబంధం ఉంది

ఈ జిల్లా పేరు చెబితే నాకు ముందు గుర్తుకొచ్చేది టంగుటూరి ప్రకాశం పంతులు. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగిగా ఈ జిల్లాలో రెండున్నర సంవత్సరాలు పనిచేశారు. రెండేళ్లు ఒంగోలులో, ఆరు నెలలు కనిగిరిలో నివసించాం. అప్పట్లో కనిగిరిలో ఫ్లోరైడ్ నీరే దిక్కు, అలాంటి పరిస్థితులు ఉండబట్టే కనిగిరిలో జీవించాలంటే ఉద్యోగులు భయపడేవారు. సాగు, తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఉపాధి అవకాశాలు లేక పశ్చిమ ప్రాంతం నుంచి ప్రజలు వలసలు పోతున్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

ఉప్పొంగిన ఉత్సాహం

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్కాపురం పర్యటన కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను పెంచింది. మధ్యాహ్నం 12.00 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకోగానే యువత అరుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. అక్కడే ఏర్పాటు చేసిన మ్యాప్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు గురించి ఆయనకు వివరించారు. ఆయన ప్రసంగం ప్రారంభించే సరికి యువతలో ఉత్సాహం పొంగిపొర్లింది. పెద్దపెట్టున కేకలు, ఈలలతో సభావేదిక ప్రతిధ్వనించింది. కుర్చీల పైన నిలబడి సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసేందుకు యువత పోటీపడ్డారు. దీంతో పలుమార్లు యువతను ఆయన వారించాల్సి వచ్చింది. వేలాది మంది కార్యక్రమానికి హాజరుకావడంతో చాలామంది సభావేదిక వద్దకు చేరుకోలేకపోయారు. రాజకీయ పక్షాలకు చెందిన వాళ్లే కాకుండా పవన్‌ను చూసేందుకు మహిళలు, యువత ఎక్కువగా కార్యక్రమానికి హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎక్కడికక్కడ రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రోడ్డుకిరువైపులా ఉన్న కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ పవన్‌కల్యాణ్ సభా వేదిక వద్దకు చేరుకున్నారు.

మార్కాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వలసలు లేని ప్రకాశం జిల్లాగా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అన్నారు. మార్కాపురం మండలం నరసింహాపురంలోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం వద్ద జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా రూ.1290 కోట్లతో తాగునీటి పథకం పనులకు మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభా వేదికపై ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో మార్కాపురం డివిజన్ మరింత వెనుకబడిందన్నారు. మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో ఫ్లోరిన్ సమస్య కూడా అధికంగా ఉందన్నారు. కాలువల ద్వారా తాగునీటి సరఫరాలేక డీప్ బోర్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇంతటి దుర్భిక్ష పరిస్థితులు ఉండబట్టే ప్రజా ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా రూ.1,290 కోట్లతో ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఆరు నియోజకవర్గాల పరిధిలో 18 మండలాల్లోని సుమారు 10 లక్షల మందికి తాగునీటిని అందిస్తామన్నారు. ఈ పనులను తానే స్వయంగా పర్యవేక్షించి 18 నెలల్లోగా పూర్తయ్యేలా చూస్తానని అన్నారు. ఈ ప్రాంతంలో మనుషులేకాక పశువులు కూడా నీటికి అలమటిస్తున్నాయని ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో ఈ జిల్లా ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇక్కడి ఇబ్బందులు మరెక్కడా తలెత్తకుండా

మిగతా 6లో...



తాగునీటి గ్రిడ్ ప్రణాళికను మ్యాప్ ద్వారా తెలుసుకుంటున్న పవన్ కల్యాణ్


మహిళల కేరింత


సభకు హాజరైన జనం

ఆరు పంటలకు బీమా

- ఖరీఫ్‌లో పీఎం ఫసల్ బీమా మార్గదర్శకాలు విడుదల
- జిల్లాలో కంది, వరి, సజ్జ, మిర్చి, మినుము, నువ్వులకు అమలు
- పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఏవో శ్రీనివాసరావు సూచన



ఒంగోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆరు రకాల పంటలు ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసే ఈ పథకానికి జిల్లాల వారీగా ఎంపిక చేసిన పంటలు, ప్రీమియం చెల్లింపు, నష్టపరిహారం తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను వెల్లడించింది. ఆ ప్రకారం జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆరు పంటలకు బీమా పథకం వర్తించనుంది. ఖరీఫ్‌లో సుమారు లక్షా 87వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. అందులో అత్యధికంగా దాదాపు 68వేల హెక్టార్లలో కంది సాగవుతుండగా 27వేల హెక్టార్లలో పత్తి, 25వేల హెక్టార్లలో మిర్చి, 13వేల హెక్టార్లలో వరి, ఏడువేల హెక్టార్లలో సజ్జ ప్రధాన పంటలుగా ఉన్నాయి. నువ్వు, మినుము, మొక్కజొన్న ఇతర పలు రకాల పంటలు సాగు చేస్తారు. బీమా మొత్తంలో ఒక్కొక్క పంటకు 1.50 శాతం నుంచి 5శాతం వరకు రైతు తమ వాటా ప్రీమియం చెల్లిస్తే మరికొంత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వస్తే దిగుబడి ఆధారంగా ఆయా పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందిస్తారు. అలా కేంద్రం ప్రకటించిన జాబితాలో జిల్లాలో అధికంగా సాగు చేసే కంది, వరి. సజ్జ, మిర్చిలతో పాటు నువ్వు, మినుము పంటలు ఉన్నాయి. ఈ పంటలలో కొన్నింటిని గ్రామం యూనిట్‌గా, మరికొన్నింటిని మండలం, మరికొన్నింటిని జిల్లా యూనిట్‌గా బీమా లెక్కిస్తారు. జిల్లాలో గుర్తించిన పంటలలో బీమా మొత్తం చెల్లింపునకు వరి పంటకు ఆగస్టు 15 వరకు గడువు ఇవ్వగా మిగిలిన ఐదు రకాల పంటలకు జూలై 31 వరకు గడువు ఇచ్చారు. బ్యాంకుల నుంచి రుణం పొందే రైతులకు ఆ రుణం నుంచే బ్యాంకులు బీమా ప్రీమియం మొత్తాన్ని మినహాయించి బీమా కంపెనీకి చెల్లిస్తాయి. అయితే బ్యాంకు రుణం పొందే రైతులు ఎవరైనా అలా బీమా సౌకర్యం అవసరం లేదనుకుంటే ఆ విషయం బ్యాంకులకు తెలియజేయాలి. బ్యాంకు రుణం పొందిన రైతులు రైతు సేవా కేంద్రంలో బీమా పత్రాలు పొంది ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. బీమా మార్గదర్శకాలు వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం బీమా ప్రకటించిన ఆరు పంటలలో వరి పంటకు ఎకరాకు రూ.43వేలుగా నిర్ణయించగా రైతులు అందులో 2 శాతం ప్రీమియం చెల్లించాలి. కందికి బీమా రూ.21,500 కాగా 1 శాతం, సజ్జకు రూ.15,600 కాగా 1 శాతం, మినుముకు రూ.20,500 కాగా 1 శాతం, నువ్వులకు రూ.12వేలు కాగా 1.50 శాతం ప్రీమియం చెల్లించాలి. మిర్చి పంటకు ఎకరాకు రూ.90వేలు బీమా మొత్తం కాగా రైతులు 5 శాతం ప్రీమియం చెల్లించాలి. ఆ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను ఇచ్చింది. జిల్లాలో ఆయా పంటలు సాగుచేసే రైతులు ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) శ్రీనివాసరావు కోరారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోకుండా బీమా పొందవచ్చని తెలిపారు.

పాఠశాలలకు రూ 3.67కోట్లు విడుదల

ఒంగోలువిద్య, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కాంపోజిట్ స్కూలు గ్రాంటు కింద రూ.3.67 కోట్లు విడుదలయ్యాయి. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని 2,295 పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి రూ.5.87 కోట్లు మంజూరు కాగా అందులో 50శాతం అంటే రూ.2.97 కోట్లు పాఠశాలలకు విడుదల చేశారు. పబ్లిక్ ఫైనాన్స్ మేనేజింగ్ సిస్టమ్ ద్వారా ఈ నిధులు పాఠశాలల ఖాతాలకు జమ అవుతాయి.

- జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కింద ఒక్కొక్క పాఠశాలకు రూ.50వేల చొప్పున రూ.24 లక్షలు విడుదలయ్యాయి.
- 48 పీఎం శ్రీ పాఠశాలలకు కాంపోజిట్ స్కూలు గ్రాంటు కింద రూ.50.5 లక్షలు విడుదలైంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా



పాఠశాలలకు కాంపోజిట్ స్కూలు గ్రాంటు మంజూరు చేస్తున్నారు. పాఠశాలలకు విడుదలైన కాంపోజిట్ స్కూలు గ్రాంటులో 10 శాతం పాఠశాలల్లో స్వచ్ఛతా కార్యక్రమాలకు, 20శాతం నిధులు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణకు వినియోగించాలని సమగ్ర శిక్ష ఏఎంవో నాగరాజు తెలిపారు.

సకల పుణ్యరాశి తొలి ఏకాదశి

- విష్ణుమూర్తి యోగనిద్ర ఆరంభం
- చాతుర్మాస్య దీక్షకు శ్రీకారం
- పల్లెల్లో పేలాల పిండి సందడి
- రేపు పండుగ

7

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా డిపోల ఎదుట నిరసనలు

7

సహకారంతోనే మెరుగైన ప్రపంచం

- నేడు అంతర్జాతీయ సహకార దినోత్సవం

రెండు నెలలే ఉండేది.. కప్పం కట్టాల్సిందే..!

- డివిజన్‌స్థాయి అధికారి అక్రమ వసూళ్లు
- స్థాయిని బట్టి పంచాయతీ కార్యదర్శులకు టార్గెట్లు



ఆయనో డివిజన్‌స్థాయి అధికారి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాస్థాయి అధికారిగా కూడా పనిచేశారు. వైసీపీ నాయకులతో అంటకాగి ఇష్టారీతిన దోపిడీకి పాల్పడిన చరిత్ర ఆయన సొంతం. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయనపై చర్యలు తీసుకుని డివిజన్‌స్థాయికే పరిమితం చేసినా తీరుమారలేదు. మరో రెండు నెలల్లో పదవీ విరమణ కూడా చేయనున్నారు. ఈలోపే చేతనైనంత వెనుకేసుకోవాలని యోచించి ఆ దిశగా వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఆ శాఖలోని మండలానికి ఒక ఉద్యోగికి వసూళ్ల బాధ్యతను అప్పజెప్పారు. డబ్బులిస్తే సరే లేదంటే మీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు సైతం దిగుతున్నారు. ఇప్పటికే ఒకమారు జిల్లాస్థాయి అధికారికి కప్పంకట్టిన తాము మళ్లీ డివిజన్‌స్థాయి అధికారికి కూడా ఎందుకు ఇవ్వాలంటూ కొందరు ఎదురు తిరుగుతున్నారు. మరికొందరు మాత్రం పంచాయతీల అభివృద్ధికి పాటుపడాల్సిన తమను ఇలా ఉన్నతాధికారులు వసూళ్ల 'పంచాయితీ' పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే ఎలా అంటూ బాధపడుతున్నారు.

మార్కాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలల క్రితం పంచాయతీరాజ్ శాఖకు మార్కాపురం డివిజన్ బాధ్యతలు చేసే ఓ అధికారి వచ్చాడు. ఎన్నికల విధుల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన నేపథ్యంలో ఉన్నతాధికారులు సస్పెండ్ కూడా చేశారు. నాలుగు నెలల్లో రిటైర్ అవుతున్నందున మానవతాదృక్పథంతో పోస్టింగ్ ఇచ్చారు. అయినా ఆయనలో మార్పు రాలేదు. పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాల్సిన ఆ అధికారి

మిగతా 6లో...

వలసల్లేని ప్రకాశం లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ఉండాలనే ఉపాధిహామీ పథకం నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా పశువుల తొట్టెలను నిర్మించామన్నారు. మార్కాపురంలో గత వైసీపీ హయాంలో లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం భూములను కూడా వదలకుండా కబ్జాలు చేశారన్నారు. వైసీపీ నాయకులు గద్దల్లా ఆ భూములపై వాలి దోచేశారన్నారు. దేవదాయశాఖ ఇప్పటికే కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ రవినాయక్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, మార్కాపురం, ఒంగోలు, కనిగిరి, సంతనూతలపాడు, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రియాజ్, మార్కాపురం ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ పాల్గొన్నారు.

వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా కల సాకారం చేస్తాం

- మంత్రి బాలవీరాంజనేయస్వామి

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా కల తప్పక సాకారమవుతాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా గత ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు నిధులు మంజూరయ్యాయన్నారు. గత వైసీపీ హయాంలో ఆ నిధులను సక్రమంగా ఉపయోగించకపోవడంతోనే నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం రూ.1,290 కోట్లు మొదటి విడతగా నిధులను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పలుమార్లు కేంద్ర మంత్రులతో మాట్లాడి రాష్ట్రానికి జల్‌జీవన్ మిషన్ నిధులను రాబట్టారన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణానికి రూ.185 కోట్ల మేర ఉపాధిహామీ నిధులను ఇప్పటికే జిల్లాకు మంజూరు చేశారన్నారు. పనులు కూడా పూర్తయ్యాయన్నారు.



సభలో డిప్యూటీ సీఎం పవన్ మాజీ మంత్రి గురించి మాట్లాడుతున్న సమయంలో వేదికపై నుంచి అభివాదం చేస్తున్న బాలినేని

తాగునీటి పథకంతో జిల్లాకు స్వర్ణయుగానికి నాంది

- ఆనం రామనారాయణరెడ్డి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా భవిష్యత్ స్వర్ణయుగం కావడానికి తాగునీటి పథకం నాంది పలుకుతుందన్నారు. దశాబ్దాలుగా తాగునీటి కోసం అలమటించిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఈ పనులు పూర్తయితే సురక్షిత నీరు అందుతుందన్నారు. వెలిగొండ పూర్తిచేస్తే దొనకొండ ప్రాంతంలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పడతాయని, ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం జిల్లాతోపాటు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరిలోని క్షామపీడిత ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఈ జిల్లాతో అనుబంధం ఉన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. రాష్ట్రానికి నిధుల కొరత ఉన్నందున పీపీపీ విధానం ద్వారా పలు ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం మార్కాపురం డివిజన్ అన్నారు. వర్షాలు కురవక, పంటలు పండక, తాగునీరు దొరక్క ఈ ప్రాంత ప్రజలకు వలసలే దిక్కయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సివిల్ ఇంజనీర్ ఆత్మహత్యాయత్నం

- తీరం ఒడ్డున అపస్మారక స్థితిలోకి
- పర్యాటకులు గుర్తించి 108కు సమాచారం
- విషమంగా మార్టూరుకు చెందిన అనిల్ పరిస్థితి


అపస్మారక స్థితిలో అనిల్‌కుమార్

రామాపురం (చీరాల), జూలై 4 :రామాపురం సముద్రతీరంలో సివిల్ ఇంజనీర్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. అంది న వివరాల ప్రకారం మార్టూరు మండలం కోలలపూడి గ్రామానికి చెందిన బొబ్బేపల్లి అనిల్‌కుమార్ ఇటీవల సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. మరికొద్ది రోజుల్లో హైదారాబాదులో ఉద్యోగ ప్రయత్నాలకు వెళ్లనున్నాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ, శుక్రవారం ఉదయం తండ్రి శ్రీ నివాసరావును అడిగి బయటకు వెళుతున్నట్లు చెప్పి ద్విచక్ర వాహనంపై రామాపురం తీరానికి వచ్చాడు. ఈక్రమంలోనే శీతల పానియంలో పురుగు మందు కలుపుకొని తాగి అపస్మారక స్థితికి చేరాడు. అనంతరం మిత్రులకు ఫోన్ ద్వారా మిస్ యూ అంటూ సందేశం పంపి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో ఒడ్డున పడి ఉన్న అనిల్ పరిస్థితి గ్రహించిన పర్యాటకులు 108కు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన చీరాల ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే ఆయన తండ్రికి కూడా సమాచారం అందజేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

● చీరాల - స్వర్ణ రోడ్డులో ఘటన

చీరాల, జూలై 4 : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన చీరాల-స్వర్ణ దారిలో శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబం ధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం ఇడుపులపాడుకు చెందిన అందె ప్రసాద్ తన బావమరిది బిక్కి నాగేశ్వరరావును ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని చీరాల వైపు వస్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్ ఎడమ కాలుకు తీవ్ర గాయం కాగా, నాగేశ్వరరావు శరీరంపై పలుచోట్ల స్వల్పగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వేగంగా వచ్చి ఢీకొట్టిన ద్విచక్రవాహనంపై యువకులు అక్కడి నుంచి అంతేవేగంగా పారిపోయారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పింఛన్ డబ్బులు ఇవ్వలేదని తండ్రిపై కత్తితో దాడి

అద్దంకి,జూలై4(ఆంధ్రజ్యోతి): ఖర్చులకు పింఛన్ డబ్బులు ఇవ్వాలని తండ్రిపై కుమారుడు కత్తెరతో దాడి చేసిన ఘటన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో చోటుచేసుకొంది. పట్టణంలోని సాయిబాబా మందిరం సమీపంలో బాబాగుడి సమీపంలో నివాసం ఉండే వృద్ధుడు కమలనాథం స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన రోడ్డులో చెప్పుల దుకాణం నిర్వహించుకుంటు జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆయన కమారుడు నాగాంజనేయులు ఒంటరిగా వేరుగా ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం పక్కరోడ్డులో చెప్పుల దుకాణంలో ఉన్న కమలనాథం వద్దకు కొడుకు వచ్చి ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఇచ్చేందుకు ఆయన నిరాకరించడంతో కత్తెరతో దాడి చేశాడు. దీంతో పలు చోట్ల గాయాలు అయ్యాయి. స్థానికులు కమలనాథంను ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు

రెండు నెలలే ఉండేది.. కప్పం కట్టాల్సిందే!

(5వ పేజీ తరువాయి)

వసూళ్ల పర్వానికి తెరలేపారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి తాను నిర్దేశించిన విధంగా తప్పకుండా కప్పం చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. కొందరు భయపడి చేయి తడిపారు. తాము ఎక్కడ నుంచి తెచ్చి డబ్బులు ఇవ్వాలని మరికొందరు ఎదురు తిరిగారు. అలాంటి వారిని భయభ్రాంతులకు గురిచేసి ముక్కుపిండి మరీ వసూలు చేసుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారి దృష్టికి వెళ్లినా చూసీచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. మూడు మాసాల క్రితమే ఆ జిల్లాస్థాయి అధికారి కూడా ఇదేరీతిన వసూళ్లకు పాల్పడటంతోనే డివిజన్‌స్థాయి అధికారిని కట్టడి చేయలేకపోయాడని ఆ శాఖలోని ఉద్యోగుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

మండలానికో ఉద్యోగికి వసూళ్ల బాధ్యతలు

డివిజన్‌లోని 12 మండలాలలోగల సుమారు 200 పైచిలుకు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి వసూలు చేయాలంటే కష్టమైన పని కావడంతో ఈ బాధ్యతను మండలానికో ఉద్యోగికి అప్పజెప్పారు. కొన్ని చోట్ల ఈవోపీఆర్డీలకు, మరికొన్నిచోట్ల అవినీతి వ్యవహారాల్లో ఆరితేరిన కార్యదర్శులకు ఈ దందా వ్యవహారాన్ని అప్పజెప్పారు. ఇప్పటికే మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో వసూళ్లు పూర్తయినట్లు తెలిసింది. గిద్దలూరు నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో ఇంకా వసూళ్లు మొదలుకానట్లు సమాచారం. అక్కడి పంచాయతీ కార్యదర్శులు కొందరు ఎదురు తిరగడంతో వారిని భయపెట్టేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సైతం డివిజన్‌స్థాయి అధికారి వెనుకాడటంలేనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరికి శ్రీముఖాలు తయారు చేసినట్లు ఆ శాఖలోని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. మరీ ముఖ్యంగా అగస్టులో రిటైరవుతున్నందున ఆ ఫంక్షన్‌కు కూడా ఇప్పటి నుంచే డబ్బులు సమీకరించాలని ఒత్తిడి చేస్తుండటం విశేషం.

గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులతో అంటకాగిన అధికారి

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ అధికారి సామాజికవర్గానికే చెందిన పల్నాడు జిల్లాలోని ఓ కీలకమైన నాయకుని ప్రాపకంతో జిల్లాస్థాయి పోస్టింగ్ పొందారు. అప్పట్లో అధికారం అండతో ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడిన చరిత్ర ఆయన సొంతం. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో అప్పటి అధికార పార్టీ నాయకులకు అన్నివిధాలా సాయం అందించినట్లు తెలిసింది. ఎన్నికల విధుల్లో కూడా పక్షపాతం చూపారు. కొన్ని సంఘటనల్లో రుజువులు తేలడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ అధికారిపై సస్పెన్షన్ విధించింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

చీరాల, జూలై 4 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్‌జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రావు, చీరాల డిపో కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్పించాలన్నారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీ ద్వారానే నడపాలని డిమాండ్ చేశారు.

అద్దంకిలో

అద్దంకిటౌన్ : ఆర్టీసీ కార్మికుల వివిధ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపో ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వహీద్ మాట్లాడగా శివశంకర్, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పర్చూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక రామానాయుడు వ్రెస్‌వెల్ఫేర్ అసోషియేషన్ హాల్‌లో కౌలు రైతుసంఘం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి ప్రతి కౌలు రైతుకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించటంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. మిర్చిరైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమావేశంలో టి.శేషయ్య, రైతుసంఘం ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, కౌలురైతుసంఘం జిల్లా నాయకులు పి.కొండయ్య, భాను పాల్గొన్నారు.


అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు సాయం

మార్టూరు, జూలై4(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని సుగాలితండాకు చెందిన అనారోగ్యంతో చిలకలూరిపేటలోని ప్రవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భుక్యా చిలకమ్మ అనే ఒంటరి మహిళకు శుక్రవారం హెల్పింగ్ హాండ్స్ వారు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపి 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

సకల పుణ్యరాశి తొలిఏకాదశి



● విష్ణుమూర్తి యోగనిద్ర ఆరంభం ● చాతుర్మాస్య దీక్షకు శ్రీకారం ● పల్లెల్లో పేలాలపిండి సందడి ● రేపు పండుగ

మనం ఏ పని ప్రారంభించాలన్నా మంచి తిథులను చూస్తుంటాము. పాడ్యమి మొదలు చతుర్దశి వరకు ఉన్న తిథుల్లో దశమి, ఏకాదశిలకు మిగతావాటికన్నా అత్యంత ప్రాధాన్యం ఇస్తాము. అటువంటి ఏకాదశిలు నెలకు రెండు చొప్పున సంవత్సరానికి 24 వస్తుంటాయి. అయితే ఆషాడమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశికి మాత్రం ఒక ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం చైత్ర శుద్ధ పాడ్యమిని సంవత్సర ఆరంభంగా, తెలుగు సంవత్సరాదిగా జరుపుకుంటున్నాం కానీ, అంతకుపూర్వం ఆషాడశుక్ల ఏకాదశిని సంవత్సర ఆరంభంగా పరిగణించేవారు. అందుకే సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లో ఇది మొదటిగా ఉండేది. దీంతో దీనికి 'తొలి ఏకాదశి'గా పేరువచ్చింది.

ఒంగోలు కల్చరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి) : ఇక తొలి ఏకాదశికి ఆధ్యాత్మికపరంగాను, ఆరోగ్యపరంగాను అనేక విశిష్టతలు ఉన్నాయి. ఉత్తరాయణ పుణ్యకాలం ఈరోజు నుంచే ప్రారంభమవుతుంది. అదేవిధంగా ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు ఈ రోజునుంచే నాలుగునెలల పాటు చాతుర్మాస్య దీక్షను చేపడతారు. ఇక అనేక పండుగలకు ప్రారంభం కూడా ఈ తొలిఏకాదశి నుంచే జరుగుతుంది. అందుకే పండుగలు 'ఉగాదితో ఊడ్చుకుపోతాయి, తొలి ఏకాదశితో తొలకరిస్తాయి' అని పెద్దవాళ్ల సామెత చెప్పేవారు. ఈ విధంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన తొలి ఏకాదశి పండుగను సర్వ పాపాలను హరించే పుణ్యరాశిగా చెప్పొచ్చు.

శయన ఏకాదశిగా పురాణప్రతీతి

ఇక తొలి ఏకాదశిని 'శయన ఏకాదశి'గా పిలుస్తారు. ఈరోజునే శ్రీ మహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రకు ఉపక్రమిస్తారు. తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజు అంటే నాలుగు నెలల తర్వాత ఆయన యోగనిద్రనుంచి మేల్కొంటాడు. అందుకే దాన్ని ఉత్థాన ఏకాదశిగా పిలుస్తారు. కనుక ఈ తొలిఏకాదశి రోజున విష్ణుమూర్తిని పూజించటం, విష్ణు సహస్రనామ పారాయణ చేయటం ఎంతో ఉత్తమం.

గ్రహ గమనాల్లోనూ మార్పులు

తొలి ఏకాదశి రోజు నుంచే గ్రహ గమనాల్లో మార్పులు ప్రారంభమవుతాయి. ఈ రోజు నుంచి ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లు కనిపిస్తాడు. అందుకే పగలు తక్కువగా ఉండి రాత్రి సమయం పెరుగుతుంది. ఇక వానాకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కూడా ఇదే. అసలు ఏకాదశి అంటే పదకొండు సంఖ్యకు సూచిక. మనిషిలోని ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు కలిపి మొత్తం పదకొండింటికి ఈ ఏకాదశి చిహ్నమని, వాటిని అధీనంలో ఉంచుకోవటానికి ఏకాదశి వ్రతం చేయాలని కూడా చెబుతారు. దీంతో బద్ధకం తొలగి, ఇంద్రియ నిగ్రహం పెరుగుతుందని, ఎటువంటి రోగాలు మన దగ్గరకు రావని పెద్దలు చెబుతారు. ఇక

చాతుర్మాస దీక్షకు ఆరంభం

ఇక శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే ఈ తొలి ఏకాదశి రోజునుంచే పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలు నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్షను ప్రారంభిస్తారు. ఈ నాలుగు నెలలు వారు తాము ఉన్న చోటు నుంచి ఎక్కడికీ కదలరు. అదేవిధంగా ఈ నాలుగు నెలలు ఆహార నియమాలు మారుతాయి. శ్రావణ మాసంలో ఆకుకూరలు, భాద్రపద మాసంలో పెరుగు, ఆశ్వీయుజ మాసంలో పాలు, కార్తీకమాసంలో పప్పు పదార్థాలను వారు తినరు. అదేవిధంగా వెల్లుల్లి, సొరకాయ, టమోట మొదలైనవి కూడా నిషిద్ధం. దీనివల్ల ఈ మాసాల్లో వచ్చే వాతావరణ మార్పులకు అనుగుణంగా శరీరానికి కలిగే వాత, పిత్త, శ్లేష్మ సంబంధ వ్యాధులను నివారించగలుగుతారు.

ఈ ఆషాఢమాసంలోనే ప్రకృతిలో,పర్యావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. వర్షాకాలం వల్ల శరీరానికి జడత్వం కలుగుతుంది. అందువల్ల ఉపవాసం చేస్తే జీర్ణకోశం శుభ్రపడి, దేహం నూతనోత్తేజాన్ని పొందుతుందన్నది ఏకాదశి ఉపవాసం వెనుక అంతరార్థం.



పేలాల పండుగ సందడి

ఇక తొలి ఏకాదశిని 'పేలాల పండుగ' 'పేలపిండి పండుగ' అని కూడా పిలుస్తుంటారు. ముఖ్యంగా గ్రామాల్లో ఈ పేలాల పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. జొన్న పేలాల్లో బెల్లాన్ని, యాలకులను వేసి దంచి పిండి చేస్తారు. ముందుగా విష్ణుమూర్తిని పూజించి, ఈ పిండిని నైవేద్యం పెట్టి తర్వాత చిన్నా పెద్దా ఇంటిల్లిపాది ఈ పిండిని ఎంతో ఇష్టంగా తింటారు. వర్షాల వల్ల వచ్చే జబ్బులను నివారించే వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించటానికి బెల్లం కలిసిన పేలాల పిండి ఎంతగానో ఉపయోగపడుతుంది.



ఒంగోలు డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

● ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్
● జిల్లా వ్యాప్తంగా డిపోల ఎదుట నిరసనలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 4(ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈనెల 4,5 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ డిపోల ఎదుట ధర్నాలకు పిలుపునివ్వగా, జిల్లాలోని ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, పొదిలి, గిద్దలూరు డిపోలలో ఎదుట ధర్నా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో రాష్ట్ర కార్యదర్శి కే. నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద ఉన్న ఉద్యోగోన్నతుల ఫైల్‌కు వెంటనే అనుమతులివ్వాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సొంతంగా ప్రభుత్వ సహాయ సహకారంతో కొనుగోలు చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఆదే ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నడిపించాలని, బస్సు నిర్వహణకు డిపోలను ప్రయివేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని అన్నారు. పెండింగ్ డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ అరియర్స్, 24 నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అమరావతి ఏపీజేఏసీ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ ఎస్ఆర్‌బీఎస్ ఉద్యోగులకు 18 శాతం వడ్డీతో బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే కాలం చెల్లిన బస్సుల బ్రేక్‌డౌన్‌కు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులను చేసి, అక్రమ పనిష్‌మెంట్‌లు ఇస్తున్న విధానాన్ని తొలగించాలని తెలిపారు. ఒంగోలు డిపో కార్యదర్శి జి. మాధవరావు మాట్లాడుతూ సీసీఎస్ కార్యాలయాన్ని ఉద్యోగులకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ హౌస్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి కే. రామకృష్ణ మాట్లాడుతూ ఏడీ, పీడీ, ఎస్‌పీడీ క్లరికల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అన్నీ వర్క్ షాపులలో నెలవారీ మూవింగ్, యావరేజ్ టీఆర్ఎస్ విధానం అమలు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఐదు డిపోలలోనిఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సింథైట్ ఫ్యాక్టరీ ఎదుట గ్రామస్థుల ఆందోళన



ఫ్యాక్టరీ సిబ్బంది, గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

మేదరమెట్ల, జూలై 4(ఆంధ్రజ్యోతి): కారం కోరుకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ మేదరమెట్ల గ్రామస్థులు సింథైట్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా కోరు వస్తున్నా, ఫ్యాక్టరీ యాజమాన్యం పరిష్కారం చూపించడం లేదని, కేవలం కంటితుపుడు చర్యలు మాత్రమే చేపడుతూ, కాలం వెళ్లదీస్తుందోని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీని గ్రామస్థులు మూసి వేయించారు. యాజమాన్యం వచ్చి గ్రామస్థులతో మాట్లాడే వరకు ప్రారంభించడానికి లేదని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహమ్మద్ రఫీ ఫ్యాక్టరీ సిబ్బంది, ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడారు. యాజమాన్యం వచ్చేంత వరకు ఫ్యాక్టరీని ప్రారంభించబోమని సిబ్బంది హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

సహకారంతోనే మెరుగైన ప్రపంచం

నేడు అంతర్జాతీయ సహకార దినోత్సవం



ఒంగోలు విద్య, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సహకార రంగ పటిష్టతతోనే మెరుగైన ప్రపంచం సాధ్యమవుతుంది. మెరుగైన సమాజం కోసం సహకార వ్యవస్థలు, సంస్థలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవశ్యకత, అవసరం ఎంతైనా ఉంది. సమాజంలో సహకార రంగఅవశ్యకతను ఐక్యరాజ్యసమితి ఎప్పుడోగుర్తించింది. బ్యాంకులు ఇంతగా అభివృద్ధి చెందినప్పుడు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి సహకార సంస్థలే ఊతమిచ్చాయి. రైతులను ఆదుకొనేందుకు సహకార చక్కెర కర్మాగారాలు, సహకార స్పిన్నింగ్ మిల్లులు, పొగాకు సమాఖ్యలో సొసైటీలు. డీసీసీబీలు ఆవిర్భవించాయి. మొదట్లో ఈ సంసంస్థలన్నీ రైతులకు ఇతోధికంగా సేవలు అందించాయి. ఆ తర్వాత మితిమీరిన రాజకీయ జోక్యం, స్వార్థపూరిత పాలక వర్గాలు సహకార స్ఫూర్తిని కొంత దెబ్బతీసినా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందించడంలో సహకార సంస్థలు ముందంజలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా సేవాతత్పరతగల వ్యక్తులు పాలకవర్గాలుగా వస్తే సహకార సంస్థలు పరిరక్షించడంతో పాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయి. అంతర్జాతీయ సహకార దినోత్సవం 1954లో ఆవిర్భవించింది. 1992 డిసెంబరు 16న జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం 47/90లో అంతర్జాతీయ సహకారకూటమి స్థాపన జరిగింది. 1995 జూలై మొదటి శనివారాన్ని అంతర్జాతీయ సహకార దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచిప్రతి ఏటా జూలై మొదటి శనివారాన్ని అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఏటా సహకార రంగానికి సంబంధించిన అంశాలను ప్రధానాంశంగా తీసుకొని అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సహకార సంస్థలద్వారా సుస్థిర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారిత, సమాజ నిర్మాణం ప్రధాన లక్ష్యాలుగా ఈ అంతర్జాతీయ వేడుకలను నిర్వహిస్తున్నారు. సహకార సంఘాలను ప్రోత్సహించడం, స్వయం సహాయం, స్వీయబాధ్యత, సమానత్వం, సంఘీభావం విలువలను పెంపొందిస్తారు. ఆర్థిక సామాజికాభివృద్ధిని ప్రోత్సహించడంలో సహకార వ్యవస్థల పాత్రను ప్రముఖంగా చూపించడం, సహకార సంస్థల విజయాలు సమాజానికి వాటి సహకారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు.

స్థిరమైన అభివృద్ధికి సహకారం

స్థిరమైన అభివృద్ధిలో సహకార సంస్థలు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా పేదరికం తగ్గింపు, ఆర్థికస్థితి స్థాపకతతో సమ్మిళిత అభివృద్ధికి సహకార సంఘాల అంశం ఆధారంగా 2025 అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. జూలై 1న అన్ని సంఘాల్లో మొక్కలు నాటడం, మోడల్ ఆడిటింగ్‌పై అవగాహన కల్పించడం, 2న సహకార రంగంపై సభ్యులకు అవగాహన కల్పించడం, 3న సహకార రంగంలో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన, సహకార సంఘాల చరిత్రపై వివరించడం, 4న సహకార రంగంపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడం. 5న స్వచ్ఛతలో సహకార రంగంపై ప్రచారం, 6న ముగింపు సమావేశాలు నిర్వహిస్తారు. ఈనెల 1నుంచి జిల్లాలో పీడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సహకార ఉద్యమ ఆశయాలు, లక్ష్యాలపై ప్రజలలో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మగౌరవ సమస్యలు పరిష్కరించాలి

బాపూజీ మార్కెట్ కాంప్లెక్సు ఎదుట మౌనదీక్ష



రోశయ్య విగ్రహం వద్ద మౌన దీక్ష చేపట్టిన నాగరాజు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆర్యవైశ్యుల ఆత్మగౌరవ సమస్యలు పరిష్కరించాలని పొట్టి శ్రీరాముల అభిమాన సంఘం నాయకులు పెరకం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. దీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులోని రోశయ్య విగ్రహం వద్ద తొలగించిన ఫౌంటైన్, లైట్లు మునిసిపల్ కార్పొరేషన్ నిధులతో తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. రోశయ్య జన్మించిన జిల్లా బాపట్లకు రోశయ్య జిల్లాగా నామకరణం చేయాలని డిమాండ్ చేసిన నాగాంజనేయులు అమరజీవి పొట్టి శ్రీరాములు స్వయంగా శ్రమదానం చేసి నిర్మించిన మారెళ్ల గ్రామంలోని హాస్పిటల్‌ను చారిత్రక భవనంగా ప్రకటించి, అభివృద్ధి కోసం రూ. 35లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దాంతోపాటుగా ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు కేటాయించిన రూ. 500 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని, రోశయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

అమరావతి రాజధాని పూర్తి కోసం ఎండుమిర్చితో హోమం



ఎండుమిరపకాయలతో హోమాన్ని నిర్వహిస్తున్న ప్రత్యంగిరా పీఠాధిపతి బ్రహ్మజీ

పొదిలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అదే విధంగా అమరావతి రాజధాని త్వరగా పూర్తి కావాలని ప్రత్యంగిరా పీఠాధిపతి బ్రహ్మజీ స్వామి ఆకాంక్షించారు. పెదారికట్ల గజేంద్రగిరి కొండపై మాతాజీ కృష్ణవేణమ్మ తలపెట్టిన ఎండుమిరపకాయల హోమం, శివలింగ ప్రతిష్ఠకు హాజరైన ఆయన పొదిలిలో మీడియాతో మాట్లాడారు. వారాహి నవరాత్రుల సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాజధాని అమరావతి ఎలాంటి అడ్డంకులు లేకుండా త్వరగా పూర్తికావాలని ఎండుమిరపకాయలతో హోమం, శివలింగ ప్రతిష్ఠ చేస్తున్నట్లు తెలిపారు.

వైపాలెంలో బయటపడ్డ 15,16వ శతాబ్దపు ఆళ్వారుల విగ్రహాలు

గుర్తించిన పరిశోధకులు శ్రీనివాసప్రసాద్
వృచ్చికాల మల్లయ్య దేవాలయంలో భద్రం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : శివాలయం సమీపంలో జరిగిన తవ్వకాల్లో 15, 16వ శతాబ్దపు నాటి ఆళ్వారుల విగ్రహాలు బయటపడ్డాయి. శివాలయ ప్రాంతంలో ఇటీవల పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్స్‌కవేటర్‌తో తీసిన మట్టిని ట్రాక్టర్‌తో ఊరి బయటికి తోలుతున్నారు. మట్టితో పాటు పలు రకల విగ్రహాలు ముక్కలు ముక్కలుగా సమీప రాళ్లవాగు వద్ద వాటిని పలువురు గమనించి పురావస్తు శాసన పరిశోధకులైన శ్రీనివాసప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకొని వాటిని పరిశీలించగా ఆ విగ్రహాలు 15, 16వ శతాబ్దాల కాలానికి చెందిన 11 మంది ఆళ్వార్లవని తెలిపారు. వాటిని సమీప వృచ్చికాల మల్లయ్య స్వామి దేవాలయంలో భద్రపరిచినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఆ కాలంలో శివాలయ సమీపంలో ఆ విగ్రహాలకు పూజలు చేసి ఉంటారని అన్నారు. ఆ విగ్రహాలు విరిగి పోవడంతో పక్కన పెట్టి ఉంటారని ఆయన వివరించారు.



15,16వ శతాబ్దపు ఆళ్వారుల విగ్రహాలు

వీడని ఆరుష్‌రెడ్డి అదృశ్యం కేసు మిస్టరీ

● ఆరు సంవత్సరాలుగా బిడ్డ కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు



ఆరుష్ రెడ్డి(ఫైల్)

ముండ్లమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్ గ్రామానికి చెందిన మేడం అశోక్‌రెడ్డి, జ్యోతిల కుమారుడు చిన్నారి ఆరుష్‌రెడ్డి అదృశ్యమై ఆరు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ పోలీసులు ఆచూకీ కనిపెట్టలేకపోయారు. జూన్ 26, 2019న సాయంత్రం సమయంలో ఆరుష్‌రెడ్డి ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. అదేరోజు కుటుంబసభ్యులు ముండ్లమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగించారు. నేటికీ ఆచూకీ లేదు. ఐదారు నెలలు మాత్రం కేసు గురించి పోలీసులు పట్టించుకున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినా కూడా ఎటువంటి సమాచారం లేదు. దీనికితోడు అప్పుడు పనిచేసిన పోలీసు అధికారులు డీఎస్పీ నుంచి ఎస్ఐ వరకు వరుసగా బదిలీ కావటం కూడా ఆరుష్‌రెడ్డి తల్లిదండ్రులకు కొంత శాపంగా మారింది. కొత్తగా వచ్చిన అధికారులు చిన్నారి అదృశ్యం పై దృష్టి పెట్టక పోవటంతో ఇక మరుగున పడింది. బిడ్డ ఆచూకీ కోసం తల్లిదండ్రులు గాలించని ప్రాంతమంటూ లేదు. ఆరుష్‌రెడ్డి అదృశ్యమై ఆరు సంవత్సరాలు కావస్తోంది. పోలీసులు చిన్నారి ఆరుష్‌రెడ్డి అదృశ్యం కేసును ఛాలెంజ్‌గా తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తేనే గాని కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ముండ్లమూరు ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కమలాకర్‌కు జిల్లాలో సమర్థవంతుడైన అధికారిగా పేరుంది. ఆ కేసు పై దృష్టి సారించ గలిగినట్లయితే చిన్నారి ఆరుష్‌రెడ్డి అదృశ్యం మిస్టరీ వీడే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హంసా క్వారీలో ఆర్డీవో విచారణ



క్వారీలో విచారణ చేస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

చీమకుర్తి, జూలై4(ఆంధ్రజ్యోతి): రామతీర్థం సమీపంలో ఉన్న హంసా మినరల్స్ గ్రానైట్ క్వారీలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న శుక్రవారం ఉమ్మడి తనిఖీలు జరిపారు. క్వారీ యజమాని ప్రభుత్వ భూములను, వాగు భూములను ఆక్రమించుకొని క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించారు. రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా విచారణ అంశాలతో కలెక్టర్‌కు నివేదికను అందజేయనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు'



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చీమకుర్తి, జూలై4(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం చీమకుర్తి పట్టణంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఏడాది కాలంలో ప్రజలకు జరిగిన మేలును నాయకులు వివరించే కరపత్రాలను ఇంటింటా తిరిగి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, ముప్పూరి చలమయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ళ గంగాధరరావు, నాగరాజు పాల్గొన్నారు.

శ్మశానం కోసం స్థల పరిశీలన

సంతనూతలపాడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎం.వేములపాడులో శ్మశానం కోసం తహసీల్దార్ ఎస్ఎల్.నారాయణరెడ్డి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సర్వేనెంబరు 201లోని భూమిని రెవెన్యూ బృందం సందర్శించి అందుకు సంబంధించిన వివరాలను తహసీల్దార్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య సేవలు ఆదర్శనీయం



ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

నాగులుప్పలపాడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలను ఉప్పుగుండూరు గ్రామంలోని లైబ్రరీ సెంటర్‌లో వాసవీ జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య ఆయా రాష్ట్రాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వాసవీ జాగృతి ఇంటర్ నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడు అమరా వెంకట సుబ్బారావు, క్లబ్ అధ్యక్షుడు అత్మకూరి వాసు, అమరా రాజేంద్ర, పల్లపోతు నాగేశ్వరావు, కృష్ణ ప్రసాద్, తేలప్రోలు శ్రీరాములు, తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని ఆర్యవైశ్యమందిరంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు ఆర్యవైశసంఘం నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, మల్లికార్జున, జీఎల్.ప్రసాదరావు, శరత్, వాసవీక్లబ్, మహిళా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అల్లూరి జయంతిని నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆంజనేయులు మాట్లాడుతూ బ్రిటీష్ వారి దుర్మార్గాలకు, దౌర్జన్యాలకు బలవుతున్న మన్యం ప్రజల విముక్తికి అల్లూరి పోరుబాట పట్టారన్నారు. కార్యక్రమంలో సీహెచ్.వినోద్, విజయ్, ఆనంద్ బాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో నిలిచిన ప్రహరీ నిర్మాణం

పొన్నలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా చెప్పుకున్న నాడు-నేడు పథకం, కొన్నిచోట్ల విద్యాలయాలకు శాపంగా మారింది. మంజూరైన నిధులను దారి మళ్లించడంతో చాలా చోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పొన్నలూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ప్రహరీ నిర్మించేందుకు 2022లో నాడు-నేడు పథకంద్వారా ఫేజ్-2 కింద ప్రతిపాదనలు తయారుచేశారు. సుమారు 500 మీటర్ల పొడవున ప్రహరీ నిర్మాణానికి రూ.47 లక్షలతో ప్రతిపాదనలు పంపగా రూ.12.54 లక్షలు మంజూరయ్యాయి. అయితే పని మొదలుపెట్టేలోపే వాటిలో రూ.7 లక్షలు వేరే కాలేజీల్లో పనులకు మళ్లించారు. ప్రభుత్వం నుంచి సిమెంటు సరఫరా చేయగా, విడుదలైన నిధులతో ఇటుక, కంకర, ఇనుము, ఇసుక తదితర మెటీరియల్ కొనుగోలుచేసి పనులు ప్రారంభించారు. ముందుగా పునాది పనులు పూర్తిచేశారు. నిధులు అంతవరకే సరిపోగా, తరువాత మళ్లీ నిధులు విడుదల చేయలేదు. మిగిలిన సిమెంటు గడ్డకట్టిపోయింది. అప్పటి నుంచి కాలేజీ ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఇటీవల మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పొన్నలూరు పర్యటనకు వచ్చినప్పుడు కాలేజీ సిబ్బంది కలిసి, ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ, వెంటనే నిధులు మంజూరు చే యిస్తానని హామీ ఇచ్చారు.

కనిగిరిని ఆదుకోండి..!

● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే ఉగ్ర వినతి

కనిగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతుందని, ఆదుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. శుక్రవారం మార్కాపురం వచ్చిన పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే కలిసి ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వివరించారు. కనిగిరి ప్రాంతంలో డయాలసిస్ బాధితుల సమస్యను వివరించారు. ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా చేస్తే ప్రధానంగా ఉన్న డయాలసిస్, ఫ్లోరైడ్ సమస్య పరిష్కారమై ప్రజలు సంతోషిస్తారని తెలిపారు. ఆయా అంశాలపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం నిధులు మంజూరుకు సంబంధిత శాఖకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తన తండ్రి కొణిదెల వెంకట్రావు ఉద్యోగరీత్యా కనిగిరి ప్రాంతంలో 40ఏళ్ళ క్రితం ఉండటంతో తాము ఇక్కడే ఉన్నామన్నారు. అప్పట్లో ఇంకా ఇబ్బందిగా ఉందని చెప్పారు. కేవలం కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటి కారణంగా ఆరు నెలలకే బదిలీ చేయించుకుని వెళ్ళాల్సి వచ్చిందన్న విషయాన్ని డిప్యూటి సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు తెలిసిన వాడిగా మీరు కోరిన విధంగా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసి శాశ్వతంగా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ● ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట ● పైరెడ్డిపాలెంలో ఇంటింటి ప్రచారం



వృద్ధురాలి సమస్యలను ఆలకిస్తున్న మంత్రి స్వామి

పొన్నలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతికుటుంబానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పొన్నలూరు మండలంలోని పైరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం మంత్రి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరించడమే కాకుండా, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ తొలి ఏడాది పాలనలో అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంత మందికి తల్లికివందనం పథకాన్ని అమలుచేసి తొలి హామీని నిలబెట్టుకున్నామని అన్నారు. మండలంలో సుమారు రూ.3 కోట్లతో కొత్తగా సీసీరోడ్లు నిర్మించామని, వైసీపీ ప్రభుత్వంలో అర్థంతరంగా నిలిచిన పనులన్నీ త్వరలోనే పూర్తిచేస్తామని మంత్రి స్వామి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం ఎలా ఉంది, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కావాలనే తమ ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిపివేశారని ఎస్సీకాలనీవాసులు కొందరు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే ఆ ఇళ్లకు నీటి కనెక్షన్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పింఛన్ డబ్బులు సక్రమంగా అందుతున్నాయా, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారా, రాయితీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా అంటూ మహిళలను మంత్రి ఆరాతీశారు. ముందుగా గ్రామంలోని ఎస్సీకాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన మంత్రి స్వామికి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పైరెడ్డిపాలెం మాజీసర్పంచ్ కర్హా కోటిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, పొన్నలూరు ఎంపీటీసీ గంధం స్వప్న, కె.అగ్రహారం సర్పంచ్ చినమస్తాన్, పార్టీనేతలు గుమ్మళ్ల వెంకట్రావు, పల్లపోతు ప్రసాద్, మండవమురళీ, మన్నెం రమణయ్య, నల్లూరి నాయుడు, ఉన్నం శీనయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే దామచర్ల



డ్రైనేజీ సమస్యపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు ఏడాది పూర్తయిందని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఇంటికీ వెళ్ళి పలకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని 43వ డివిజన్ శ్రీరామ్‌కాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్ళి పలకరించిన దామచర్ల ప్రజా ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. అలాగే ఇంకా సమస్యలు ఉన్నట్లయితే సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నగర అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నాని ప్రజలకు వివరించారు. అలాగే అధికారులు కూడా తగినరీతిలో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డివిజన్‌లలోని పలు సమస్యలను ప్రజలు వివరించగా, మరికొన్ని సమస్యలను దామచర్ల నేరుగా గుర్తించారు. దీంతో కార్పొరేషన్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆరు నెలల్లో మళ్ళీ డివిజన్లలో పర్యటిస్తానని తెలిపారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



యువతికి కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఈదుమూడిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, గ్రామస్థులు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బీఎన్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి ప్రజలతో మమేకమై ఇంటింటికి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కరపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలయిందని విమర్శించారు. చెప్పిన మాట ప్రకారం పింఛన్లను ఒక్కసారిగా పెంచి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. కుటుంబంలో ఎందరు పిల్లలుంటే అంతమందికి అమ్మకు వందనం పథకం ద్వారా నగదు అందించినట్లు చెప్పారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవతో అండగా నిలుస్తున్నామన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు, గృహిణులకు ఉచితంగా మూడు సిలిండర్లు అందిస్తున్న ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు మెగా డీఎస్సీ విడుదల చేసిందని, ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అందించనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో సుపరిపాలన జరుగుతుందన్నారు. మంచి ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడు మద్దతు పలకాలని కోరారు. పలువురు గ్రామస్థులు తమ సమస్యలను ఎమ్మెల్యే బీఎన్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవర ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి గుమ్మడి సాయిబాబా, గ్రామ అధ్యక్షులు కుర్రా వీరాంజనేయులు, లంబు నాగేశ్వరరావు, కొండ్రగుంట రంగారావు, ఆళ్ల నాగార్జున, మెట్టు సుబ్బయ్యనాయుడు, తెలగతోటి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి

● నివాళులర్పించిన ఎంపీ మాగుంట



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట, కాపు సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లాకాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరం రామనగర్‌లోని రంగా విగ్రహానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, డాక్టర్ నారపుశెట్టి శ్రీనివాసరావు, నరసింహారి సాంబ్య, తంజావూరి శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రంగా చేసిన సేవలను కొనియాడారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నంద్యాల శ్రీనివాసరావు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, గోపి, నక్కా ప్రమీల, పి.రాజసులోచన, చింతలపల్లి నారాయణ, మేకల నారాయణ, పెంట్యాల శ్రీనివాసరావు, రామారావు, మిరియాల వెంకటేశ్వర్లు, లింగిశెట్టి సుబ్బారావు, రామరాజుకుమార్, హనుమంతరావు, బ్రహ్మయ్య, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

కాపు కళ్యాణ మండపంలో...

స్థానిక కాపు కళ్యాణ మండపంలో రంగా జయంతి వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం కాపు కళ్యాణ మండపం నుంచి రామ్‌నగర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి అక్కడి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు, దాసరి పిచ్చయ్య, బండారు సురేష్, దొంతుల హరికిషోర్, పి.శ్రీమన్నారాయణ, ఎన్.నిర్మల, లక్ష్మీప్రసన్న, దుర్గ, చాకిరి ధనుంజయ, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, కొల్లి హనుమంతరావు, నారాయణ, కాపు కళ్యాణ మండపం కార్యదర్శి ఆరిగ చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి డీఆర్వో చినఓబులేషు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి దేశభక్తి, ధైర్యసాహసాలను ప్రజలందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సీతారామరాజు స్ఫూర్తితో యువత నడవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవోతోపాటు సూపరిటెండెంట్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శనీయం

ఒంగోలు విద్య: స్వాతంత్ర్యసమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు ఆదర్శ ప్రాయమని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. అల్లూరి జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకులను ఎదిరించిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం.హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం కొప్పోలులోని బీవీఆర్ ఎయిడెడ్ పాఠశాలలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సీతారామరాజు నాటికను ప్రదర్శించారు. అనంతరం మాజీ ఉపసర్పంచ్ కోనంకి చిరంజీవి మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలను కొనియాడారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, జామంట్రీ బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు నాటక మండలి నాయకులు విజువూరి అంజిరెడ్డి, గంగాడి రామకృష్ణ, కొండ్రాజు రమేష్, జగన్నాథం జయరాజు, మోడుబోయిన నాగరాజు, శింగమనేని సుబ్బారావు, ఉట్టిగుంట అంజిరెడ్డి, హెచ్ఎం ఉన్నం రమణయ్య పాల్గొన్నారు. కాగా అల్లూరి సీతారామరాజుగా వేషధారణ చేసిన 7వ తరగతి విద్యార్థి వంశీని అభినందించారు.



అల్లూరి వేషధారణలో వంశీ

క్విస్ అధ్యాపకుడికి డాక్టరేట్



శ్రీనుకు డాక్టరేట్‌ను అందజేస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న నిడమానూరి శ్రీనుకు డాక్టరేట్ లభించింది. చెన్నైలోని భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ నుంచి ఆయన డాక్టరేట్ అందుకున్నారు. కస్టమర్ ఫీడ్‌బ్యాక్ క్లాసిఫికేషన్ యూజింగ్ బై డైరెక్షనల్ లాంగ్, షార్ట్ టర్మ్ మెమొరీ అండ్ లాజిక్ అనే అంశంపై డాక్టర్ శివరామకృష్ణన్ గైడెన్స్‌లో పరిశోధన చేసినందుకు డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈ అంశంపై ఆయన జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేపర్లను కూడా విడుదల చేశారు. డాక్టరేట్ సాధించిన నిడమానూరి శ్రీనును శుక్రవారం స్థానిక క్విస్ విద్యాసంస్థలో అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రిలు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, సీఎస్ఈ హెచ్‌వోడీ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటీకరణ వ్యవసాయ రంగంపై ప్రభావం అనే అంశంపై ఈనెల 5వతేదీన ఒంగోలులోని బృందావనం కళ్యాణ మండపంలో జరిగే సెమినార్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పమిడి వెంకట్రావు, జయంతిబాబు ఒక ప్రకటనలో కోరారు. ఈ సెమినార్‌లో ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు, ఎంపీ అమ్రారామ్, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు హాజరవుతారన్నారు. రైతులందరూ పాల్గొనాలని కోరారు.

9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు, ఆర్డీవో చలానా తగ్గించాలని తదితర డిమాండ్లతో ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం అద్దంకి బస్టాండులో ఆటో కార్మికులు కరపత్రాలను పంపిణీ చేశారు. చలానా, టోల్ చార్జీలు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, పెట్రోలు, డీజల్ ధరలు పెరగడం వంటి కారణాలతో రవాణా రంగ కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 9వతేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మెకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సుందర్య భవన్‌లో శుక్రవారం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పనిగంటలు తగ్గించాలని తదితర డిమాండ్లతో జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసులు, వీరస్వామి, దామా శ్రీనివాసులు, టి.మహేష్, బీవీ.రావు తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూలో పలువురి పోస్టుల మార్పు

ఒంగోలు విద్య, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీలో పరిపాలన సౌలభ్యం కోసం పలు మార్పులు చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ బి.హరిబాబు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జి. రాజమోహనరావును ఓఎస్‌డీగా, వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఎన్.నిర్మలామణిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. సీడీసీ డీన్‌గా పనిచేస్తున్న సోమశేఖర్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ల వైస్ ప్రిన్సిపాల్‌గా, అలాగే కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేస్తున్న కేవీఎస్.రాజును సీడీసీ డీన్‌గా నియమించారు. వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి సూచనల మేరకు ఈ మార్పులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మద్దిపాడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): నందిపాడులోని శ్రీ గంగా పార్వతి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు రాజుపంతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

ప్రభుత్వ సలహాదారుని కలిసిన ఎన్ఆర్ఐ

మద్దిపాడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ వేమూరి రవిని మంగళగిరిలో శుక్రవారం మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లికి చెందిన ఎన్ఆర్ఐ, టీడీపీ కోఆర్డినేటర్ పోతినేని సురేష్‌బాబు, నల్లూరి అజయ్‌బాబు కలిశారు. ఈ సదర్భంగా ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ఎన్ఆర్ఐలకు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని డాక్టర్ రవి చెప్పినట్లు వారు తెలిపారు. అలాగే పెదకొత్తపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

దివ్యాంగ భవిత కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న నాగేంద్రనాయక్

జరుగుమల్లి, కొండపి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సహిత విద్య, వినికిడి బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారు ప్రధాన పాఠశాలలకు వెళ్లే విధంగా తీర్చిదిద్దాలని సమగ్రశిక్ష కోఆర్డినేటర్ నాగేంద్రనాయక్ అన్నారు. శుక్రవారం జరగుమల్లిలోని దివ్యాంగ భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ వ్యాయామంపై నాయక్ అవగాహన కల్పించారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ మసనం జాలరత్నం, భవిత రిసోర్స్ పర్సన్ ఎస్.నరసయ్య, జరుగుమల్లి జనరల్ స్కూల్ హెచ్ఎం ఎస్. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతనూతలపాడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట స్టేషన్‌పరిధిలో మరమ్మతుల శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒంగోలు రూరల్ విద్యుత్‌శాఖ డీఈ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పోలీసుల పల్లెనిద్ర



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ రజియాసుల్తానా మాచవరం గ్రామంలో గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కాగా గ్రామంలోని బహిరంగ ప్రదేశాలలో అర్ధరాత్రి వేళల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తులను ఎస్ఐ అదుపులోకి తీసుకొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

సీలింగ్ భూముల పట్టాలపై విచారణ

చీమకుర్తి, జూలై4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగసాయిపురం పరిధిలో ఉన్న సర్వే నంబర్ 86/2ఏ లో ఉన్న సీలింగ్ భూముల్లో మంజూరు చేసిన పట్టాలపై శుక్రవారం అధికారులు ప్రాథమిక విచారణ జరిపారు. ఒంగోలుకు చెందిన జి.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా పట్టాభూములను పొందటం జరిగిందని, దీనిపై విచారణ జరిపి పట్టాలను రద్దు చేయాలని కోరుతూ దొడ్డవరం గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బ్రహ్మయ్య ఆదేశాల మేరకు వీఆర్వో, సర్వేయర్‌లు భూములను పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ పట్టాలు పొందినవారికి నోటీసులు అందజేసి అవి అక్రమమా, సక్రమమా అనే విషయాన్ని నిర్ధారించటానికి చర్యలు చేపడతామని చెప్పారు.

పవన్‌పై వెల్లివిరిసిన అభిమానం

» పెద్ద ఎత్తున తరలివచ్చిన కూటమి శ్రేణులు

మార్కాపురం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన విజయవంతమైంది. పవన్ కల్యాణ్‌పై అటు కూటమి శ్రేణులు యువకుల అభిమానం వెల్లివిరిసింది. పశ్చిమ ప్రాంత మండలాలకు రూ.1290కోట్లతో తాగునీటి సమస్య పరిష్కార పనులకు డిప్యూటీ సీఎం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మార్కాపురం పరిధిలోని నరసింహాపురం గ్రామం పరిధిలో అల్లూరి పోలేరమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద నుంచి సభ వరకు కారులో వెళ్లారు. కారులో వెళ్తున్న పవన్‌ను చూసేందుకు యువత అధిక సంఖ్యలో అల్లూరి పోలేరమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. జై పవన్ అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కాన్వాయ్ వెంట పరుగులు తీస్తూ సభా వేదిక వద్దకు చేరుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్టాల్స్

పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా సభకు వచ్చిన ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రత్యేకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రత్యేక స్టాల్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజలు తమ సమస్యలను ఉప ముఖ్య మంత్రికి తెలిజేసేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక స్టాల్‌ను అల్లూరి పోలేమ్మగుడి వద్ద, సభ జరుగుతున్న ప్రాంతాలలో అధికారులు ఏర్పాటు చేశారు.

అలంరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప ముఖ్యమంత్రి సభా వేదిక వద్ద మార్కాపురం మండంలం బోడపాడు గ్రామ ఎంపిపి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించారు. పాఠశాల బాలికలు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో పాటలకు నత్యం చేశారు. పుణ్య భూమి నాదేశం పాటకు విద్యార్థులు నృత్యం ఆకట్టుకుంది. పట్టణానికి చెందిన స్నేహ అకాడమీ ఆధ్వర్యంలో యువతలు భరతనాట్యంతో అందరినీ ఆకట్టుకున్నారు.



సభాస్థలికి కారులో వెళ్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పవన్ సభకు తరలిన నాయకులు

మార్కాపురం మండలంలోని గ్రామాల నుండి అధిక సంఖ్యలో ఉప ముఖ్య మంత్రి పవ న్ కల్యాణ్ సభకు నాయకులు, ప్రజలు తరలి వెళ్ళారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది కాలంలోనే అనేక మంచి పనులు చేసి చూపారని నాయకులు తెలిపారు. పవన్ కల్యాణ్ సభకు గ్రామాలలోని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని గ్రామ నాయకులు తెలిపారు. మండలంలోని పెద్ద నాగులవరం, బోడపాడు, పెద్దయాచవరం, గజ్జలకొండ, చింతగుంట్ల గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు, మహిళలు, యువకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సభను విజవంతం చేశారు.



తర్లుపాడులో పవన్ సభకు బయలుదేరిన మహిళలు

తర్లుపాడు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు బయలుదేరి వెళ్లారు. వీరిలో ఎక్కువగా మహిళలు కూడా రలివెళ్లడం విశేషం. మండలంలో 20 బస్సులు, ఆటోలలో సభను విజయవంతం చేసేందుకు వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చేతుల శ్రీనివాసులు, నాయకులు కంచెర్ల కాశయ్య, పుచ్చనూతల గోపీనాథ్ చౌదరి, నంబుల లక్ష్మయ్య, మేకల అచ్చిరెడ్డి, మేలక వెంకట్, వెలుగు కాశీరావు, సుబ్బ య్య, రోశప్ప నాయుడు, రామిరెడ్డి, సత్తెనపల్లి చలమయ్య కలిసి పలువురు కార్యకర్తలు మార్కాపురానికి తరలివెళ్లారు.

రాచర్ల : పవన్ కల్యాణ్ బహిరంగ సభకు రాచర్ల మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మార్కాపురానికి తరలివెళ్లారు. మండల నాయకుడు శంకర్ నాయుడు ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో బయలుదేరారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీ

కంభం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : డెంగీ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని కందులాపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఎడిస్ దోమ మనుషులను కుట్టడం వలన ఒకరి నుంచి మరొకరికి వస్తుందని, డెంగీ దోమ మంచి నీటిలో పెరుగుతుందన్నారు. ఈ దోమ పగటిపూట మాత్రమే కుడుతుందన్నారు. కావున ప్రతి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి కందులాపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి రంగా కృషి మరువలేనిది



రంగా విగ్రహనికి నివాళులర్పించిన కాపు నాయకులు

రాచర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కాపుల అభ్యున్నతికి వంగవీటి మోహనరంగా ఎనలేని కృషి చేశారని కాపు నాయకులు పుట్ట బాలకృష్ణ, శిరిగిరి మురళి అన్నారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా మండలంలోని అనుములపల్లి జంక్షన్‌లో శుక్రవారం వారు రంగా విగ్ర హానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాపు జాతి అభివృద్ధికి రంగా పాటుపడ్డారన్నారని మురళి తెలిపారు. కార్యక్రమంలో అనుములపల్లి సర్పంచ్ శిరిగిరి రమేష్, మండల కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : వంగవీటి మోహన్‌రంగా జయంతిని స్థానిక బలిజ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. వారంతా వంగవీటి మోహన్ రంగారావు చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కాపు నాయకులు ముద్దర్ల శ్రీనివాసులు, టింబర్ డిపో శ్రీను, యగటీల పాండు, రంగనాయకులు, బాలచెన్నయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాచర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. మండలంలోని సత్యవోలు, రంగారెడ్డిపల్లె, ఒద్దులవాగుపల్లె, సోమిదేవిపల్లె, సంగపేట గ్రామాల్లో శుక్రవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 6గంటలకు చెత్త బండ్లను తీసుకొని గ్రామాల్లోని వీధులకు వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి సేకరించిన చెత్తను గ్రామం వెలుపల డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. గ్రామాల్లోని వీదులన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. పారిశుధ్య కార్మికులు క్రమం తప్పకుండా గ్రామాల్లోకి వచ్చి చెత్త సేకరిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలసుకోవాలన్నారు. సిబ్బంది బాధ్యతగా పారిశుధ్య పనులు చేయించాలని ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని అన్నారు. ఎంపీడీవో వెంట ఈవోఆర్డీ వెంకటేష్, సచివాలయ కార్యదర్శులు సరస్వతి దేవీ, వైఎస్‌జి రంగనాయకులు ఉన్నారు.

గురుగ్రామ్ సదస్సులో మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, జూలై 4(ఆంధ్రజ్యోతి): భారత పార్లమెంట్ హర్యానా ప్రభుత్వం సహకారంతో గురుగ్రామ్‌లో జరిగే జాతీయస్థాయి అవగాహన సదస్సుకు దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు ఆహ్వానం అందడంతో వెళ్లా రు. పట్టణ, స్థానిక సంస్థల చైర్మన్లకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై ఈనెల 3, 4 తేదీ ల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భం గా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, హ ర్యానా స్పీకర్ హరివేంద్రర్ కల్యాణ్‌ను కలిసి బొకేలు అందజేశారు. సదస్సు లో ఎన్నో అంశాలను తెలిపారని ఈసందర్భంగా పిచ్చయ్య తెలిపారు.



హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు బొకే అందజేస్తున్న దర్శి మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ

పెద్దారవీడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. మండలంలో తంగిరాలపల్లి పంచాయతీలోని తమ్మడపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం తంగిరాలపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి తొలి ఏడాది ప్రజా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ల పంపిణీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం పథకాలను అమలు చేశారన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దోచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందన్నారు. నాడు గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సుఖంగా వెళ్లే పరిస్థితికి ప్రజా ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏవో ఎన్.లక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్ర గుంట్ల నాగేశ్వరరావు, నాయకులు శ్రీనివాసుల రెడ్డి, వెన్నా కోటిరెడ్డి, వెంకటరెడ్డి, ఇండ్లా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న బాలాజీ, ఎరిక్షన్‌బాబు

వృద్ధుడికి ఎమ్మెల్యే సొంత డబ్బులతో పింఛన్

» అశోక్‌రెడ్డి భరోసా

» బాధితుడికి అందించిన టీడీపీ నాయకులు

గిద్దలూరు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అందరిలా తనకు పింఛన్ రావడంలేదని వృద్ధుడు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసేంత వరకు సొంతంగా తన డబ్బు ఇస్తానని ప్రకటించి ఆ వృద్ధుడికి భరోసా ఇచ్చారు. ఇటీవల సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా 2వ వార్డులో ఈనెల 2వ తేదీ బుధవారం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఎం.పుల్లయ్య అనే వృద్ధుడు తనకు పింఛన్ రావడం లేదని, అధికారులకు చెప్పినా ఫలితం లేదని ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి విచారించగా, కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని తెలిపారు. దీనితో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరయ్యే వరకు ప్రతినెలా రూ.4వేలు సొంతంగా ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం కౌన్సిలర్ చంద్రశేఖర్‌యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్యతోపాటు పలువురు టీడీపీ నాయకులు పుల్లయ్య ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పంపిన రూ.4వేల పింఛన్‌ను అందించారు. ఎమ్మెల్యేకు పుల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు షేక్ అహమ్మద్‌బాషా, టీడీపీ నాయకులు వలసాని వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అంకయ్య, జిల్లెల సంపత్‌కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకటించిన పింఛన్ సొమ్మును వృద్ధుడికి అందజేస్తున్న టీడీపీ నాయకులు



సీతమ్మ వారికి సారె పెట్టిన మహిళలు

సామూహిక కుంకుమ పూజలు

గిద్దలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులో గల సీతారామస్వామి దేవస్థానంలో ఆషాఢ మాస పూజలు వైభవంగా జరిగాయి. వాసవీ ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని అమ్మవారిశాల నుంచి మేళ తాళాలతో సారెను తీసుకుని వచ్చి సీతారామస్వామి దేవాలయంలో అమ్మవారికి అందచేశారు. అనంతరం అమ్మ వారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ఆవరణలో జరిగిన సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వాసవీ ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు సీతారామస్వామి దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సరఫరా కల్పించాలి

» గూడేల్లో రోడ్లకు అటవీ అనుమతులు ఇప్పించాలి

» డిప్యూటీ సీఎం పవన్‌కు ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి

ఎర్రగొండపాలెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని గిరిజన గూడేల్లో గిరిజనులకు వ్యవసాయానికి సింగిల్ ఫేస్ నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు మార్చాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మార్కాపురం పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్‌ను కలిసి ఎరిక్షన్‌బాబు వినతిపత్రం అందజేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో గిరిజన గూడెంలు ఎక్కువగా ఉన్నాయని, గిరిజనులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. నల్లమల అడవిలోని పాలుట్ల, గుట్టలచేను, పొన్నలబైలు గూడెంలకు రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని, రోడ్ల నిర్మాణం చేపట్టడానికి అటవీ అనుమతులు ఇప్పించాలని ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వెనుక బడిన ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో పంచాయతీరాజ్ రోడ్లు, గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకారం అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు.

నేడు మాగుంట పర్యటన

గిద్దలూరు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి ఈనెల 5వ తేది శనివారం గిద్దలూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆమేరకు స్థానిక టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8గంటలకు రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి స్వామి వారిని దర్శనం చేసుకోనున్నారని, అనంతరం ఆలయ అభివృద్ధిపై కమిటీ సభ్యుల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సావిత్రి

సమాజసేవలో యువత పాల్గొనాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి

పెద్ద దోర్నాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో యువత పాల్గొనాలని తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డైరక్టర్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు యూత్ ఫర్ సోషల్ ఇంపా ఇంపాక్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సావిత్రి మాట్లాడుతూ వైఎఫ్ఎస్ఐ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సమాజంలోని సమస్యలను గుర్తించి తగిన సూచనలు చేస్తూ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయబాబు, సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



గిద్దలూరు డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

గిద్దలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసి కార్మికులు శుక్రవారం స్థానిక డిపో ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ఆరేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న 10వేల పోస్టుల భర్తీ చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసినే సొంతంగా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం డిపోలను ప్రైవేటు ఆపరేటర్లకు లీజ్‌కు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను చెల్లించాలని, పిఆర్‌సి 24 నెలల బకాయిలను చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చక్రపాణి, బి.ఎన్.రెడ్డి, తిరుపతయ్య, జాఫర్, షేక్ భాషా తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : ఎస్‌బీటీ, ఎస్‌ఆర్‌బీఎస్ బకాయిలను వడ్డీతో వెంటనే చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు దివాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. 11వ పీఆర్‌సీ 24 నెలలు బకాయి ఉందని వెంటనే చెల్లించాలని, డీఏలు ప్రకటించాలన్నారు. 12వ పీఆర్‌సీని కమిటీ నియమించి ఐఆర్‌ని ప్రకటించాలన్నారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయడానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ మెంబర్ కొండలు, జోనల్ నాయకులు బెజవాడ రవి, రీజినల్ సెక్రెటరీ పిడుగు వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు పీఎస్ రెడ్డి, కాలేబు, కేవీ రావు, ఓబులేసు, ఎస్కేబాష, ఎస్కే జిలాని, డ్రైవర్స్, కండక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫసల్ బీమాతో రైతులకు ప్రయోజనం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సాగు చేసిన పంటలకు ఫసల్ బీమా యోజనతో రైతులకు ప్రయోజనమని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఈవీ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని బోయలపల్లి గ్రామ సచివాలయంలో ఏవో నీరజ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. పత్తి పంటకు ఎకరానికి రూ.2100 రైతు ప్రీమియం చెల్లిస్తే ఆకాల విపత్తుల వేళ పత్తి పంటకు వ్యవసాయ బీమా కంపెనీ రూ.42వేలు చెల్లిస్తుందన్నారు. అలాగే ఇతర పంటలపై ప్రీమియం తదితర విషయాలను ఇన్సూరెన్స్ కంపెనీ అధికారి బలరామ స్వామి రైతులకు అవగాహన కల్పించారు. పూర్తి వివరాల కోసం ఎప్పుడైనా రైతు సేవా కేంద్ర సిబ్బందిని, సీఎస్‌సీ సెంటర్లను, మీ సేవా సెంటర్‌లను లేదా 7997550524 సంప్రదించవచ్చునని అన్నారు.

ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోగల జీ కొత్తపల్లి గ్రామంలో ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అనుములవీడు ప్రాథమిక వైద్యశాల వైద్య అధికారి డాక్టర్ భానుకుమార్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జీకొత్తపల్లి గ్రామంలో ఆశా వర్కర్ ఉద్యోగ విరమణ చేయగా, ఆ స్థానానికి కొత్త వర్కర్ నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. పదవ తరగతి పాసై 25సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్న వారు వితంతు, విడాకులు పొంది భర్తతో విడిపోయి, నిరాశ్రయంతో ఉన్న మహిళలకు ప్రాధాన్య ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 10వ తరగతి సర్టిఫికెట్, నివాస, రేషన్, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, బీపీఎల్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్సులతో ఈనెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలు అనుములవీడు ఆసుపత్రిలో లభిస్తాయన్నారు.

జలశక్తి మిషన్‌తో తాగునీటి సమస్యకు పరిష్కారం

దర్శి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జలశక్తి మిషన్ పథకం ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలశక్తి మిషన్ పథకంలో తొలివిడతలో భాగంగా పశ్చిమ ప్రకాశం జిల్లాలో రూ.1290కోట్ల పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేయడం శుభపరిణామమన్నారు. దీంతో పశ్చిమ ప్రకాశంతో పాటు దర్శి నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో తాగునీటి సమస్య పూర్తిగా తొలిగిపోతుందన్నారు. ప్రజలందరి కీ స్వచ్ఛమైన మంచినీరు అందించే అవకాశం కలుగుతుందన్నారు. అలాగే, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు నిధులు త్వరగా విడుదలయ్యేందుకు కృషి చేస్తామని పవన్‌కల్యాణ్ ప్రకటిం చటం పట్ల ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

ముఖాముఖి

పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

ఎం.శ్రీదేవి, ఎంపీడీవో, ముండ్లమూరు



ప్రశ్న: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుదలకు గ్రీన్ అంబాసిడర్లను నియమించాం. వారి ద్వారా ప్రతిరోజు చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డుల్లో వర్మి కంపోస్టు తయారుచేసి వచ్చే ఆదాయం ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

ప్ర: మండలంలోని ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా?

జ: మండలంలో ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా అమలుచేస్తున్నాం. ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి పథకం అందకపోతే తమ దృష్టికి తెచ్చినట్లయితే విచారించి పథకాలు వర్తింపచేస్తాం.

ప్ర: మండలంలో ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్నారా?

జ: మండలంలో ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ఉండేందుకు ప్రతి బుధవారం ఆ శాఖ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. గ్రామాలకు వెళ్ళి పనులు పర్యవేక్షిస్తున్నాం.

రహదారుల అభివృద్ధికి చర్యలు

ముండ్లమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మలూరు నుంచి నాయుడుపాలెం వెళ్ళే లింకు రోడ్లను ఎంపీడీవో ఎం.శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. జడ్పీ సీఈవో చిరంజీవి ఆదేశాల మేరకు మండలంలోని లింకు రహదారుల పరిస్థితి చూసి ప్రతిపాదనలు పంపటం జరుగుతుందన్నారు. నిధులు మంజూరయిన వెంటనే మండలంలో రహదారులన్నింటినీ అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే రహదారిని కూడా పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ రాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

పామూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఏపీవో బి.మాల్యాద్రికి శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మెనోటీసు అందచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వై.వీరనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను, మహేంద్ర, చిన్నమ్మి, కౌలూరి హనీఫ్, నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా చిట్టిబాబు ఎన్నికపై హర్షం

పామూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడిగా పామూరుకు చెందిన ఒంగోలు చిట్టిబాబును గురువారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పామూరులోని సోమిశెట్టి నారాయణ అపార్ట్‌మెంట్‌లో చిట్టిబాబు మిత్ర మండలి శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు నాయకత్వంలో బీఎస్పీ బలోపేతం అవుతుందన్నారు. ఈసందర్భంగా చిట్టిబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిగుడు శ్రీనివాసులు, ఆర్ఆర్ రఫి, టి.సుబ్బారావు, పత్తు మస్తాన్, వై.రాఘవ, వై.అస్లీం, జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

తాళ్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో-1 జి.సుబ్బయ్య, ఎంఈవో-2 సుధాకర్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగించాలని సూచించారు. సమయం ప్రకారం విద్యార్థుల హాజరు నమోదు చేయాలన్నారు.

సైదాను పరామర్శించిన టీడీపీ నేతలు

తాళ్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కాశీం సైదా మాతృమూర్తి కాశింబీ(87) వయోభారంతో గురువారం రాత్రి మృతిచెందారు. మల్కాపురంలో ఆమె మృతదేహానికి శుక్రవారం మండల నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. సైదాకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రాచకొండ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

కనిగిరిని ఆదుకోండి..!

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వినతి



పవన్‌కల్యాణ్‌కు కనిగిరి ప్రాంత ఫ్లోరైడ్ సమస్యను వివరిస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతం ప్రధానంగా ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతుందని, ఆదుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కోరారు. శుక్రవారం మార్కాపురం వచ్చిన పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యే కలిసి అందుకవసరమైన నిధులను మంజూరు చేయించాలని కోరారు. ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వివరించారు. కనిగిరి ప్రాంతంలో డయాలసిస్ బాధితుల సమస్యను వివరించారు. ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా చేస్తే ప్రధానంగా ఉన్న డయాలసిస్, ఫ్లోరైడ్ సమస్య పరిష్కారమై ప్రజలు సంతోషిస్తారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన పవన్‌కల్యాణ్ నిధులు మంజూరుకు సంబంధిత శాఖకు ఆదేశాలు ఇచ్చారు.

ఈసందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తన తండ్రి కొణిదెల వెంకట్రావు ఉద్యోగరీత్యా కనిగిరి ప్రాంతంలో 40ఏళ్ళ క్రితం ఉండటంతో తాము ఇక్కడే ఉన్నామన్నారు. అప్పట్లో ఇంకా ఇబ్బందిగా ఉందని చెప్పారు. కేవలం కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటి కారణంగా ఆరు నెలలకే బదిలీ చేయించుకుని వెళ్ళాల్సి వచ్చిందన్న విషయాన్ని డిప్యూటీ సీఎం తెలిపారు. కనిగిరి ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు తెలిసిన వాడిగా మీరు కోరిన విధంగా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసి శాశ్వతంగా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తామ న్నారు.



మండలాల పార్టీ అధ్యక్షులు, పరిశీలకులు నాగేశ్వరరావుతో సమావేశమైన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వంలో కనిగిరి ప్రాంతంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీ అధ్యక్షులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశించారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కనిగిరి నియోజకవర్గ పరిశీలకులు గంగోదు నాగేశ్వరరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామపార్టీ కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించి పార్టీ అభివృద్ధికి తోడ్పడే నాయకత్వ కమిటీని ఎన్నుకునేందుకు కసరత్తు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ప్రజల సమస్యలను, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మండలాలపార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

» మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

దర్శి, జూలై 4(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. మండలంలోని బట్టువారిపల్లిలో శుక్రవారం సాయంత్రం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు అందజేశారు. పథకాలు అందుతున్న తీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా పాపారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్నారన్నారు. గత వైసీపీ పాలకుల కక్షసాధింపు, అవినీతి, అక్రమ పాలనతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఏడాదికాలంలో ప్రభుత్వం పనితీరును గురించి ప్రజల స్పందన తెలుసుకునేందుకే ఈకార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజలతో మమేకమవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ళ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దారం సుబ్బారావు, నానబాల అంకయ్య, రూపినేని రామారావు, తిరుపతిరావు, పులిమి యల్లయ్య, సానె సుబ్బయ్య, జూపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బట్టువారిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, పాల్గొన్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో చినపీర్ల గ్రామోత్సవం

పామూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల్లో భాగంగా ఏడవ రోజైన శుక్రవారం చిన పీర్ల సరగత్తుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చావిడిల ఎదురుగా తవ్వి ఉన్న అగ్నిగుండం వద్ద ఖాశీం స్వామి పీర్లను స్వామి జెండాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి నిలబెట్టారు. ఈసందర్భంగా పామూరు పాత బస్టాండ్ వద్దఉన్న నగిరి చావిడి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గూగుడు పీరావలి, సీఎస్‌పురం రోడ్డులో దర్గా వద్ద ఉన్న చవిడిలకు సంబంధించిన పీర్లు తప్పెట్లు మేళతాళాలతో గ్రామోత్సవంగా బయలుదేరి స్థానిక పాబోలు సెంటర్ వద్ద గల జెమ్మిచెట్టు దగ్గర సలాములు అందుకున్నాయి. అనంతరం అయ్యప్పస్వామి గుడి మీదుగా అమ్మవారిశాల వీధి, ఆర్టీసీ బస్టాండ్, కనిగిరి రోడ్డు, సీఎస్‌పురం రోడ్డు మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా హిందూ ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని పీర్లకు పప్పులు, బెల్లం, పానకాన్ని నైవేద్యంగా సమర్పించి ఫాతేహాలు జరిపించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పట్టణంలోని తూర్పు వీధిలోగల స్వామి జెండాలను ఊరేగింపు నిర్వహించగా, భక్తులు బిందెలతో నీళ్లను వారులుగా పోసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం దర్గా చెట్టువద్ద ముజావర్లు కార్యక్రమాలను నిర్వహించారు.



జెండాలతో దర్గాచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

'ఉపాధి'లో ఉద్యాన పంటలకు ప్రాధాన్యం

» ఎంపీడీవో హనుమంతరావు

పీసీపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై టీఏలు, ఎఫ్ఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా జామ, నిమ్మ, బత్తాయి, మామిడి, సీతాఫలం, సపోట, దానిమ్మ వంటి ఉద్యాన పంటలను సాగు చేయించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పీసీపల్లి మండలంలో 300ఎకరాలలో ఈ పంటలను సాగుచేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పంటల సాగుకు పాదులు తీసే దగ్గర నుండి మొక్కలకు అయ్యే ఖర్చు, ఎరువులు తదితర ఖర్చులన్నీ ఉపాధి పథకం ద్వారా ఖర్చు చేయవచ్చునని చెప్పారు. త్వరితగతిన చిన్న, సన్నకారు రైతులను గుర్తించి ఉద్యాన పంటలు సాగుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. మస్టర్లు వేసిన వెంటనే వాటిని సర్వర్‌కు అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధిలో అక్రమాలకు తావులేకుండా పనులు చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో జహంగీర్ బాషా, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

చెత్త సంపద కేంద్రాలతో ఆదాయం

» డీఎల్‌పీవో ఆర్.పద్మజ

ముండ్లమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతాయని డీఎల్‌పీవో ఆర్.పద్మజ అన్నారు. శుక్రవారం మండలంలోని శంకరాపురం, నూజెండ్లపల్లి, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి గ్రామ పంచాయతీలను ఆమె సందర్శించారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తడి, పొడి చెత్త ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామంలో ప్రధానంగా వీధి లైట్లు, పలు అభివృద్ధి పనులకు వినియోగించుకోవటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాలరావు, రబ్బానీ, గురునాథం, రాజరాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



శంకరాపురంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మజ

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

తాళ్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు, మాధవరం గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఒంగోలు డీఎల్‌పీవో పద్మ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద కేంద్రాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలన్నారు. వర్మి కంపోస్టు ఎరువును తయారుచేసి రైతాంగానికి విక్రయించాలన్నారు. తద్వార పంచాయతీలకు ఆదాయం వస్తుందని చెప్పారు. మాధవరం గ్రామంలో పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఐవీ రమణారెడ్డి, అల్లం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలుచేస్తున్న ప్రభుత్వం

తాళ్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో అమలుచేస్తూ ప్రజలకు అండగా నిలుస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గత వైసీపీ పాలనలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బొద్దికూరపాడులో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా మేడగం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ల మేరకు మూడు ఉచిత గ్యాస్‌సిలెండర్లు, పెన్షన్ పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, పశుపోషకులకు పశువుల షెడ్లు మంజూరుచేసి పేదల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఏడాది పాలనలో టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టిన పనులకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పి.సుబ్బారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, పి.రమణారెడ్డి, రాచకొండ వెంకట్రావు, వీరనాగిరెడ్డి, బాలశంకరరావు, శ్రీను, మహిళలు, శ్రేణులు పాల్గొన్నారు.



హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు బొకే అందజేస్తున్న దర్శి మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

గురుగ్రామ్ సదస్సులో మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, జూలై 4(ఆంధ్రజ్యోతి): భారత పార్లమెంట్ హర్యానా ప్రభుత్వం సహకారంతో గురుగ్రామ్‌లో జరిగే జాతీయస్థాయి అవగాహన సదస్సుకు దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యకు ఆహ్వానం అందడంతో వెళ్లారు. పట్టణ, స్థానిక సంస్థల చైర్మన్లకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, హర్యానా స్పీకర్ హరివేంద్రర్ కల్యాణ్‌ను కలిసి బొకేలు అందజేశారు. సదస్సులో ఎన్నో అంశాలను తెలిపారని ఈసందర్భంగా పిచ్చయ్య తెలిపారు.

జలశక్తి మిషన్ ద్వారా తాగునీటి సమస్యకు పరిష్కారం

దర్శి, జూలై 4(ఆంధ్రజ్యోతి): జలశక్తి మిషన్ పథకం ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఈమేరకు శుక్రవారం ఓప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలశక్తి మిషన్ పథకంలో తొలివిడతలో భాగంగా పశ్చిమ ప్రకాశం జిల్లాలో రూ.1290 కోట్ల పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేయటం ఆనందదాయకమన్నారు. ఈపథకం పూర్తయిన తర్వాత పశ్చిమ ప్రకాశంతో పాటు దర్శి నియోజకవర్గంలోని అన్నిగ్రామాల్లో తాగునీటి సమస్య పూర్తిగా తొలిగిపోతుందన్నారు. ప్రజలందరికీ స్వచ్ఛమైన మంచినీరు అందించే అవకాశం కలుగుతుందన్నారు.

అలాగే, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు నిధులు త్వరగా విడుదలయ్యేందుకు కృషి చేస్తామని పవన్‌కల్యాణ్ ప్రకటించటం పట్ల ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

రెవెన్యూ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

తాళ్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అర్జీలను వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కారమయ్యేలా చూడాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల సేవలు వేగవంతం చేయాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతుల అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భూముల మ్యుటేషన్‌లో జాప్యం జరుగకుండా చూడాలన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులకు కార్డులు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే లక్ష్యాలను వేగవంతంగా పూర్తిచేసేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అనూష, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు నివాళి

పామూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కాపు సంఘం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా 78వ జయంతి వేడుకలను శుక్రవారం పామూరులో ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నీరుకట్టు నాయబ్‌రసూల్, నరసింహారావు, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో శుక్రవారం వంగవీటి మోహన్‌రంగా 78వ జయంతి వేడుకలు ఘనంగాజరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నికాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గంటా వెంకటేశ్వర్లు, ఎం.సుజాత, నారిశెట్టి శ్రీనివాసరావు, షేక్ మస్తాన్‌వలి, తూము రవికుమార్, కనిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కురిచేడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలలో ఎరువులు, పురుగుమందులు కొనుగోలుచేసిన వారు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. దుకాణాలలో విత్తన నిల్వలు, లైసెన్సులు, బిల్లులు, రిజిస్టర్లు పరిశీలించారు. రైతులు తీసుకున్న రసీదులను పంటకాలం పూర్తి అయ్యేవరకు దాచుకోవాలని సూచించారు సరైన లైసెన్సులు లేకుండా వ్యాపారం చేసే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఎరువుల దుకాణంలో బిల్లులు పరిశీలిస్తున్న ఏవో సంపత్‌కుమార్

మధ్యాహ్న భోజనం తనిఖీ

సీఎస్‌పురం(పామూరు), జూలై 4(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ఆరేపాలెంలో ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో రాజాల కొండారెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈనెల 10న తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ ఖాదరున్నీసాబేగం, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు విరిగిపడి వ్యక్తి మృతి

వెలిగండ్ల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాటిపల్లి గ్రామసమీపంలో శుక్రవారం తాటి చెట్టు విరిగిపడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. గుడిపాటిపల్లి పంచాయతీకి చెందిన గోనా నాగభూషణం(50) కలప వ్యాపారం చేస్తుంటాడు. ఈక్రమంలో జాళ్ళపాలెం గ్రామం వద్ద కొనుగోలు చేసిన తాటి చెట్లను కోస్తుండంగా ప్రమాదవశాత్తు మెద్దు విరిగి పైనపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ పావని తెలిపారు

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ముండ్లమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏపీవో పి.వెంకటరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఈదర, పసుపుగల్లు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలతో ఏపీవో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీస వేతనం మూడు వందలకు తగ్గకుండా పని చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. పని ప్రదేశంలోనే హాజరు తీసుకోవాలన్నారు. గతంలో జరిగిన గ్రామ సభల్లో ఆమోదించిన పనులు మాత్రమే చేయాలన్నారు. అలా కాకుండా పనులు చేస్తే బిల్లులు నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

ముండ్లమూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సుంకరవారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేశారు. కూటమి వచ్చిన ఏడాది కాలంలోనే చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్య క్రమంలో సుంకర రాఘవరెడ్డి, తేలుకుట్ల బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

3 జిల్లాలు.. లక్ష్యం

రూ. 550 కోట్లు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఈ ఏడాది కౌలు రైతులకు ఇవ్వాల్సిన వార్షిక రుణ పద్దును లీడ్‌బ్యాంక్ విడుదల చేసింది. ఈ ప్రకారం బాపట్ల జిల్లాలో రూ.200 కోట్లు, గుం టూరు జిల్లాలో రూ.170, పల్నాడు జిల్లాలో రూ.180 కోట్లను రుణాల రూపంలో అందించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో కొర్రీలు వేయడం తగదని, ఉదారంగా వ్యవహరించాలని వార్షిక రుణ పద్దు ప్రకటించే సమయంలోనే బ్యాంకర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. వార్షిక పద్దు తెరపైకి రావడంతో బ్యాంకులు అందించే రుణాలపై ఆశలు పెట్టుకుని కౌలు రైతులు సేద్యానికి సన్నద్ధమవుతున్నారు. అయితే గతంలోలా బ్యాంకులు మాయ చేస్తాయా కనికరిస్తాయా చూడాలి.

కౌలు కనికరిస్తారా?

సీసీఆర్సీ జారీలో జాప్యం


కౌలు రైతుల గుర్తింపు కోసం ప్రభుత్వం జారీ చేసే సీసీఆర్సీ కార్డులకు సంబం ధించి అధికారులు లక్ష్యాలు ఘనంగా ప్రకటిస్తున్నారు. తీరా మంజూరు దగ్గరకు వచ్చేసరికి చతికిలపడుతున్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లాలో లక్ష సీసీఆర్సీ కార్డులను కౌలు రైతులకు అందించాలని వ్యవ సాయ శాఖకు ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఇప్పటికి 18,000 కార్డులను మాత్రమే పంపిణీ చేశారు. గుం టూరు జిల్లాలో 55 వేలు, పల్నాడు జిల్లాలో 68వేల కార్డులు అందించాల్సి ఉండగా అంతులేని జాప్యం జరుగుతుంది.

- ఖరీఫ్ రుణ లక్ష్యాలు అధిగమిస్తారా
- బ్యాంకర్లపై ఆశతో సాగుకు కౌలు రైతులు
- నిర్దేశించిన గత రుణ లక్ష్యాలు చేరుకోని బ్యాంకులు
- వేలల్లో సీసీఆర్సీ కార్డులు.. రుణాలు అంతంతే
- బ్యాంకర్ల వార్షిక పద్దులో గత గణాంకాలన్నీ తీసికట్టు
- ఈ ఏడాదైనా కౌలు రైతులకు న్యాయం జరిగేనా



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ భూమి ఒకరిదైతే సాగు చేసేది కౌలురైతు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సాగు చేసే కౌలు రైతుకు సహకారం ప్రకటనలకే పరిమితమవుతోంది. ప్రధానంగా రుణాల విషయంలో బ్యాంకుల నుంచి కౌలురైతులకు సహకారం అందడంలేదన్న విమర్శలున్నాయి. ఏటా ప్రభుత్వం ఘనంగా వార్షిక పద్దు ప్రకటిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అది అమలు కావడం లేదు. ప్రభుత్వ ప్రకటన చూసి ఆశగా బ్యాంకులకు వెళ్లే కౌలు రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించి వార్షికపద్దును ఇప్పటికే లీడ్ బ్యాంకు వర్గాలు విడుదల చేశాయి. రుణ లక్ష్యాల్లో 7 నుంచి పది శాతం వరకు కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో అయినా న్యాయం జరుగుతుందని ఆశలు (మిగతా 6వ పేజీలో)



● సాగుకు సిద్ధం చేసిన పొలం



బాపట్ల రూరల్ పరిధిలోని అసైన్డ్ భూముల్లో ఆక్వా సాగు

అక్రమ సాగుకు అంతేదీ

- హడావిడి తప్ప చర్యలు శూన్యం
- వేల ఎకరాల అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు
- ఎన్జీటీ ఆదేశాల మొదలు.. నిబంధనలన్నీ బేఖాతర్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అసైన్డ్ భూముల్లో తొలుత ఇసుక తవ్వకాలు జరపడం.. తర్వాత వాటిని రొయ్యల చెరువులుగా మార్చడం ఇదీ తీర ప్రాంతంలో జరుగుతున్న తంతు. సీఏఏ (కోస్తా ఆక్వా కల్చరల్ అథారిటీ) రిజిస్ట్రేషన్ ఎవరికీ పట్టదు. ఎన్‌జీటీ మార్గదర్శకాల పట్టింపు ఊసే ఉండదు. అనధికార రొయ్యల చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేదా రూ.లక్షల్లో జరిమానా విధించాలని.. అప్పటికీ వినకుంటే.. ధ్వంసం చేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూన్(ఎన్జీటీ) ఉత్తర్వులు జారీ చేసి మూడేళ్లయ్యింది. కానీ, ఇప్పటి వరకు మత్స్యశాఖ తీసుకున్న చర్యలు ఏంటని పరిశీలిస్తే.. సమాధానమే లేదు. అనుమతి లేకుండా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను నిబంధనల ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేదంటే రూ.లక్షల్లో జరిమానా విధించడమో లేక వాటిని ధ్వంసం చేయడమో చేయాలని ఎన్‌జీటీ గతంలోనే విస్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ ఉత్తర్వులు వచ్చినప్పుడు నోటీసులు జారీ పేరిట మత్స్యశాఖ హడావిడి చేసింది. కానీ, చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా లేవు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న రొయ్యల సాగుపై నివేదిక ఇవ్వాలని గతేడాది యంత్రాంగంతో జరిగిన తొలి పరిచయ సమావేశంలోనే రెవెన్యూ మంత్రి అనగాని మత్స్యశాఖను ఆదేశించారు. అవి ఉత్త మాటలుగానే మిగిలిపోయాయి తప్పితే కనీసం నివేదిక కూడా అమాత్య చెంతకు చేరలేదని సమాచారం. మొత్తం అనధికారిక రొయ్యల సాగుపై ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలనే డిమాండ్లు జిల్లా వాసుల నుంచి పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. అసైన్డ్ భూముల్లో జీవనోపాధి కోసం ఎకరం, రెండెకరాలు సాగు చేసుకుంటున్న బక్క రైతాంగమే ఈ నోటీసులకు స్పందిస్తోంది తప్పితే వందల ఎకరాల్లో అనధికారికంగా సాగు చేసుకుంటున్న బడాబాబులెవరూ ప్రభుత్వ నిబంధనలను ఖాతరు చేయక పోవడం వారి లెక్కలేని తనానికి అద్దం పడుతోంది.

జిల్లాలో దాదాపు 11 వేల ఎకరాలు అనధికారం

జిల్లా వ్యాప్తంగా దాదాపు 23 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతుండగా ఇందులో 11 వేల ఎకరాలు అనధికారికమేనని క్షేత్ర స్థాయి గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో అసైన్డ్‌తో పాటు ప్రభుత్వ భూముల వాటా 75 శాతంగా ఉండడం గమనార్హం. ఈ సాగు అంతా కూడా అన్ రిజిస్టర్‌గానే సాగుతోంది. పైగా సంబంధిత పత్రాలు లేకున్నా.. విద్యుత్‌శాఖ అడిగిందే తడవుగా కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. వ్యవస్థలన్నీ ఏళ్ల తరబడి నిద్రావస్థలోనే ఉండడంతో ఈ సాగు ఏటికేడు పెరుగుతూ వస్తోంది. . అసైన్డ్, ప్రభుత్వ భూములను చెరబట్టి రొయ్యల సాగు చేస్తున్న బడాబాబులు కాసులు దండుకుంటున్నారు. ఈ భూములను చెరబట్టిన వారిలో ఒక్కొక్కరు 30 ఎకరాల నుంచి 100 ఎకరాల వరకు రొయ్యల సాగు చేస్తున్న వారే ఉన్నారు. అనధికారిక రొయ్యల సాగుకు. వైసీపీ హయాంలో పూర్తిగా గేట్లు ఎత్తేశారు. దీంతో అక్రమ సాగు రెట్టింపయ్యింది. 2019-2024 మధ్య కాలంలోనే దాదాపు 3 వేల ఎకరాల అసైన్డ్ భూమిని చెరబట్టి రొయ్యల చెరువులుగా మార్చినట్లు అధికారులే నిగ్గుతేల్చారు. బాపట్ల రూరల్ పరిధిలో దాదాపు 20 అడుగుల మేర ఇసుక తవ్వకాలు జరిపి తిరిగి ఆ భూములను రొయ్యల చెరువులుగా మార్చిన వైనం అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనం. తమ భూముల్లో సారం దెబ్బతిని పంట దిగుబడులు అమాంతం పడిపోతున్నాయని అప్పట్లో రైతులు వేడుకున్నా ఎవరూ స్పందించలేదు.

రైల్వేస్టేషన్లలో డిస్‌ప్లే బోర్డులకు రూ. 5.04 కోట్లు

● టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన రైల్వే శాఖ

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్‌లలో వివిధ రకాల డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు రైల్వే శాఖ రూ.5.04 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియని ప్రారంభించింది. ఈ నెల 22వ తేదీ లోపు టెండర్లు ఖరారు చేసి, ఏడాది వ్యవధిలోనే వీటిని ఏర్పాటు చేస్తుంది. రేపల్లె, మాచర్ల, మిర్యాలగూడ, నంద్యాల, గిద్దలూరు, కంభం, కురిచేడు రైల్వేస్టేషన్లలో ఈ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు అవుతాయని రైల్వే అధికార వర్గాలు తెలిపాయి.

పేదలను సంపన్నులుగా మార్చడమే లక్ష్యం

● బంగారు కుటుంబాలకు చెక్కుల పంపిణీలో మంత్రి అనగాని

నగరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలను సంపన్న కుటుంబాలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా రేపల్లెలో మంత్రి బంగారు కుటుంబానికి నగదు చెక్కును



నగదు చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుపరిపాలన తొలిఅడుగు, ఇంటింటికి తెలుగుదేశం, స్వర్ణాంధ్రవిజన్ 2047 కార్యక్రమాలతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. నగరం మండలం చిన్నమట్లపూడి గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా, ఖాదర్ మొహిద్దీన్ లకు రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరం ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లేని బజార్లు

దళారుల రంగ ప్రవేశం

- ఖాళీగా దుకాణాల దర్శనం
- ఆదరణ కోల్పోతున్న రైతుబజార్లు
- కానరాని సంచార వాహన రైతు బజార్లు

పొన్నూరుటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పొలం నుంచి వినియోగదారులకు కూరగాయలు అందిస్తున్న.. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు తక్కువ ధరకు రైతులే విక్రయించే ఉద్దేశంతో నెలకొల్పిన రైతుబజార్లు నానాటికీ ప్రాభవం కోల్పోతున్నాయి. ప్రస్తుతం పేరుకు రైతుబజార్లు ఉన్నా అక్కడ రైతులు కానరావడంలేదు. ఇక బహిరంగ (మిగతా 6వ పేజీలో)



● పొన్నూరు రైతు బజారులో ఖాళీగా ఉన్న షాపులు

పంచాయతీల్లో.. చర్యలకు శ్రీకారం

నిధుల దుర్వినియోగంపై విచారణలు కొలిక్కి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో అక్రమాలకు నెలవుగా పంచాయతీలను మార్చేశారు. అందినకాడికి నిధులను దోచేశారు. వైసీపీ నేతలకు కొంతమంది పంచాయతీ సిబ్బంది కూడా తోడవడంతో ఇష్టారీతిన అక్రమాలకు తెగ బడ్డారు. దాదాపు 300 వరకు వచ్చిన ఫిర్యాదులపై గత పాలకులు తొక్కిపెట్టారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఆయా అక్రమాలపై దృష్టిపెట్టి విచారణ చేపట్టింది. జిల్లాలోని దాదాపు 33 పంచాయతీల్లో జరిగిన నిధుల అవకతవకలపై 500 ఫిర్యాదులపై చేపట్టిన విచారణలన్నీ కొలిక్కివచ్చాయి. దీంతో సంబంధిత అక్రమార్కులపై చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆరుగురు పంచాయతీ సిబ్బందిపై వేటు వేసిన ప్రభు త్వం సంతమాగులూరు మండల పరిధిలో ఇద్దరు, అద్దంకి మండల పరిధిలోని ఓ సర్పంచ్ చెక్‌పవర్‌ను కూడా రద్దు చేసింది. గత ప్రభు త్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన మరి కొంత మంది ఉద్యోగులపై చర్యలకు సిఫారసు చేస్తూ ప్రతిపాదనలు కలెక్టర్ వెంకటమురళి వద్దకు చేరాయి. రేపోమాపో వారిపై కూడా సస్పెన్షన్ కొరడా ఝళిపించనున్నట్లు తెలుస్తోంది. భట్టిప్రోలు పంచాయతీలో రూ.1.82 కోట్ల అక్రమాలు జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. గత ప్రభుత్వంలో పని చేసిన ఓ డీపీవో వైసీపీ నేతల సేవలో తరించగా ఆయన వివరణతో పాటు జరిగిన అవక తవకల గుట్టు కూడా ప్రభుత్వం వద్దకు చేరినట్లు సమాచారం చర్యలతో సరిపెట్టకుండా నిధుల రికవరీపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలు స్తోంది. కారంచేడు మండలం కుంకల మర్రు పంచాయతీపై చేపట్టిన విచారణ నివేదిక ప్రభుత్వం వద్దకు చేరినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం చిక్కుముళ్లు ఎదురవుతుం డడంతో సాధ్యాసాధ్యాలపై అధికా రులు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

పీ-4లో రాష్ట్రంలో బాపట్ల ప్రథమం

కలెక్టర్ వెంకటమురళిని అభినందించిన సీఎం చంద్రబాబు



సీఎం వీక్షణ సమావేశానికి అధికారులతో కలిసి పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 62,388 బంగారు కుటుంబాలు ఉంటే 44,920 కుటుంబాలను 3,528 మార్గదర్శకులకు దత్తత ఇవ్వడంతో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా పీ-4 అమల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటికే 13 కుటుంబాలకు జిల్లా అధికారులు జీవనోపాధి కూడా కల్పించారు. ఈ మేరకు శుక్రవా రం కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ వెంకటమురళిని ముఖ్యమంత్రి ప్రత్యే కంగా అభినందించారు. పీ 4 అమలులో ప్రణాళిక, సమష్టిగా అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. బంగారు కుటుంబాలను 72 శాతం అనుసంధానించడం అభినందనీయమన్నారు. మిగిలిన 17వేల కుటుంబాలను మార్గదర్శిలకు దత్తత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని అన్నిజిల్లాలు బాపట్ల జిల్లాను స్ఫూర్తిగా తీసుకోవాలని సీఎం సూచించారు. జిల్లాలో 44,920 కుటుంబాలను దత్తతు తీసుకోగా వారికి ఎన్జీవోలను అనుసంధానం చేసినట్లు కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమించి పీ-4 కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. తద్వారా ఆయా కుటుంబాల్లోని వారికి నైపుణ్యాలు, కెరియర్ గైడెన్స్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో సీపీవో షాలెంరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

కౌలు.. కనికరిస్తారా?

(5వ పేజీ తరువాయి)

పెట్టుకున్న కౌలు రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. గతేడాది కూడా రుణాల విషయంలో తీవ్ర అన్యాయమే జరిగింది. గతేడాది బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలు ఆచరణలోకి వచ్చేసరికి తీసికట్టుగా ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేవలం రూ.48 కోట్లకు పరిమితమైతే, గుంటూరు జిల్లాలో రూ.32 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.40 కోట్ల వద్దే కౌలు రుణాలు ఆగిపోయాయి. పద్దు ప్రకటించే సమయంలో ప్రకటించిన రుణ గణాంకాల్లో 25 శాతం చేరుకోవడంలో కూడా బ్యాంకులు సఫలం కాక పోవడం కౌలు రైతులపై వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. బ్యాంకులు రుణాలు అందించడానికి సీసీఆర్‌సీ కార్డే ప్రామాణికమని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆ కార్డుల జారీలో క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒకవేళ కార్డు ఉన్నప్పటికీ బ్యాంకులు పట్టించు కోవడం లేదని కౌలురైతులు ఆరోపిస్తున్నారు. రేపోమాపో ప్రభుత్వం విడుదల చేసే అన్నదాత సుఖీభవ నిధుల విషయంలో కూడా కౌలు రైతుల ఊసే లేకపోవడం వారిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

నెలవారీ సమీక్షలు చేస్తేనే..

రుణాల విషయంలో బ్యాంకర్లకు ఆదేశాలకే ప్రభుత్వం పరిమితమవుతుంది. వాటి పురోగతిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు న్నాయి. రుణాల విషయంలో కౌలు రైతుల గంపెడాశలు పెట్టుకుని ఉన్నారు. గతేడాది సీసీఆర్‌సీ కార్డులను రికార్డు స్థాయిలో ప్రభుత్వం అందించింది. కానీ రుణాల విషయంలో మాత్రం వెనకడుగుగానే ఉంది. రకరకాల కొర్రీలతో రుణాల విషయంలో బ్యాంకులు కౌలు రైతులను కనికరించడంలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదేశాలతో సరిపెట్టకుండా కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో నెలవారీ సమీక్షలు జరిపి బ్యాంకులను జవాబుదారీ చేస్తే తప్ప న్యాయం జరగదు.

సమన్వయం లేక ఇక్కట్లు...

సీసీఆర్‌సీ కార్డులు మొదలుకుని బ్యాంకులు అందించే రుణాల వరకు భూ యజమానులకు అవగాహన కల్పించి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వం పదేపదే వ్యవసాయశాఖకు సూచిస్తోంది. కానీ ఆచరణలో ఈ దిశగా ప్రయత్నాలు జరిగిన దాఖలాలు కనబడడం లేదు. సీసీఆర్‌సీ కార్డుల జారీలో రెవెన్యూ, వ్యవసాయశాఖ పరస్పరం నిందించుకుంటుంటే, రుణాల విషయంలో తమతో వ్యవసాయశాఖ సమన్వయం చేసుకోవడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇలా ఒకరిమీద ఒకరు కుంటిసాకులు చెప్పుకుంటూ కౌలు రైతులకు మేలు చేయాలనే ప్రభుత్వ ఉద్దేశాలకు తూట్లు పొడుస్తున్నారు.

రైతుల్లేని బజార్లు

(5వ పేజీ తరువాయి)

మార్కెట్‌లో చోటుచేసుకునే పరిణామాలతో రైతుబజార్లకు రోజురోజుకు వినియోగదారుల నుంచి ఆదరణ తగ్గిపోతోంది. చిన్న రైతులకు అధిక ఆదాయం లభించేలా వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు అందేలా 1999లో రైతు బజార్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే గత ప్రభుత్వాలు రైతుబజార్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేశాయి. గత వైసీపీ పాలకులు రైతుబజార్లపై శీత కన్నేశారు. దీంతో ప్రస్తుతం రైతులు తగ్గి దళారులు, ప్రైవేటు వ్యాపారులు రంగ ప్రవేశంతో క్రమేణా రైతు బజార్లు ప్రాభవం తగ్గిపోయాయి. సిఫార్సులతో స్టాల్స్ దక్కించుకున్న ప్రైవేటు వ్యాపారులు ధరలు ఇష్టారాజ్యంగా పెంచి విక్రయిస్తున్నారు. మార్కెట్లలో జరిగే తూకాల్లో మోసాలు ఇక్కడ కూడా ఉంటున్నాయి. కూరగాయల నాణ్యత అంతంతే. దీంతో వినియోగదారులు రైతు బజార్ల వైపు చూడడం లేదు. వినియోగదారుల వద్దకే కూరగాయలు సరఫరా చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంచారవాహనాలు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్కడా కానరావడం లేదు. ఈ రైతు బజార్ల వాహనాలు మరమ్మతులు, నిర్వాహణ లోపంతో నిలిచిపోయినట్లు సమాచారం. తెనాలిలో 3, మరో మూడు మినీ రైతు బజార్లు, పొన్నూరులో ఒకటి, మంగళగిరి, చిలకలూరిపేట, సత్తెనపల్లిలో రైతు బజార్లు ఉండగా ఒక్కో రైతు బజార్లో రోజుకు 30 నుంచి 100 క్వింటాళ్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. రైతు బజార్లలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

ఘనంగా మన్నెం వీరుడు అల్లూరి జయంతి





అద్దంకి, మార్టూరులలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అద్దంకిటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి సందర్భంగా సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సీతారామరాజు విప్లవ పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివధర పూర్ణచంద్రరావు, మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, లేవి ప్రసాద్, అంజాద్ బాషా, మొహమ్మద్ రఫీ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మాన్యం ప్రజలకు అండగా నిలిచి, స్వాతంత్ర్య ఉద్యమాన్ని వీరోచితంగా నడిపించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కళాశాల ప్రిన్సిపాల్ యు. కోటేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన డి.గంగాధర్ ఏజీపీ వై. రమేష్‌బాబు, అధ్యాపకులు బుజ్జిబాబు, డాక్టర్ జి.ఆనంద్‌బాబు, కే.రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్‌కె. బాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.



చీరాలలో నివాళి అర్పిస్తున్న కూటమి నాయకులు

మార్టూరు: మండలంలోని రాజుగారి పాలెం గ్రామంలో క్షత్రియ యూత్ సభ్యులు, ఆధ్వర్యంలో గ్రామస్థులు, రోటరీసభ్యులు కలిసి అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో క్షత్రియ యూత్ సభ్యులు విద్యార్థులకు బిస్కట్లును, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, ఉప్పలపాటి వెంకటరామరాజు, ఉప్పలపాటి అచ్చిరాజు, దాట్ల ప్రసాద్, దాట్లసుధాకర్, వేజెండ్ల వెంకటేశ్వర్లు, రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రవినాయక్ అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీ ల్దార్ రవికుమార్, ప్రహర్ష, పలు గ్రామాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చీరాల : స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఆయన విప్లవ స్ఫూర్తిని కొనియాడారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భిక్షాలు, నాయకులు వెంకటకుమార్, శ్రీనివాస్, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఇంకొల్లు,జూలై 4, (ఆంధ్రజ్యోతి) : ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని పలువురు టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని గంగవరంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి సంక్షేమ పథకాల అమలు తీరును వివరిస్తూ, కరపత్రాలు పంచారు.కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, పాలేరు రామకృష్ణ,కరి శ్రీనివాసరావు, వలేరు మార్క్,కరి వీరాంజనేయులు, నాదేండ్ల రామకృష్ణ, బోడెంపూడి సుబ్బారావు,కరి నాగేంద్రం, నగరాజకుమారి నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాడ సారే సమర్పణ



అమ్మవారి అలంకరణ

ఇంకొల్లు,జూలై 4, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు గ్రామదేవత పద్మాలంకమ్మ తల్లి అమ్మవారికి శుక్రవారం ఆషాడ మాస సారెను భక్తులు సమర్పించారు. అమ్మవారికి భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. మేళతాళాలు డప్పువాయిద్యాలు మధ్య అమ్మవారికి ఘనంగా సారె సమర్పించి ఘనంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆషాడమాసం సందర్భంగా

వేగంగా కల్వర్టు నిర్మాణం



వేగంగా సాగుతున్న నిర్మాణ పనులు

ఇంకొల్లు, జూలై 4, (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు ఆర్టీసీ బస్టాం డు నుంచి కడవకుదురురోడ్డుకు వెళ్లు రహదారిలో మురుగు కాలువపై నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇక్కడి కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో మండల పరిషత్ నిధులు రూ.9.20లక్షలతో నూతన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణం శ్లాబ్ దశకు చేరింది. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జ్యోతి పనులు పరిశీలించారు. నాణ్యతతో పనులు చేస్తున్నామని త్వరలో పనులు పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఉపాధ్యాయుని వినూత్న ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

పర్చూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించా లని ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం తల్లిదండ్రులను ఆకట్టుకునే విధంగా సాగుతోంది. పర్చూరు మండలం అడుసుమల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది శుక్రవారం మైక్‌తో గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు నిర్మలకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆవాస ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచితవిద్య అందుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిరాం శ్రీనివాసరావు, రాఘవరెడ్డి, రవి, నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు సాయం

మార్టూరు, జూలై4(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని సుగాలితండాకు చెందిన అనారోగ్యంతో చిలకలూరిపేటలోని ప్రవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భుక్యా చిలకమ్మ అనే ఒంటరి మహిళకు శుక్రవారం హెల్పింగ్ హాండ్స్ వారు 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు.ఈ కార్యక్రమంలో కమిటి అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌వలి,జంపాని శ్రీనివాసరాజు,ఎస్‌కె హబీబా,శిల్పాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

చినగంజాం, జూలై 4(ఆంధ్రజ్యోతి) : డెంగ్యూవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం పీ.హెచ్.సీ వైద్యాధికారి సీ.హెచ్.సిరివెన్నెల అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, చినంజాం గ్రామంలో డెంగ్యూవ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇంటిపరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. 'ఫ్రైడే డ్రై డే' రోజు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చేయాలని, నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వాలు పెరుగుతాయని వాటిని గుర్తించి ఎబెట్ ద్రావణంతో పిచికారి చేయాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సందీప్ మాట్లాడుతూ ప్రతి మొదటి శుక్రవారం మానసిక వ్యాధిగ్రస్తులు పీహెచ్‌సీకి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. తెలిపారు. పొగాకు, గుట్కా వాడటం వలన వచ్చే అనర్థాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, ఎంఎన్‌వో సుబ్బారావు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మురుగుశుద్ధి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

- స్థలపరిశీలన, భూమిపత్రాల అప్పగింత




భూమిపత్రాన్ని ఎంపీడీవోకు అందచేస్తున్న తహసీల్దార్

పంగులూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో మురుగుశుద్ధి కర్మాగారం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీని నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని శుక్రవారం తహసీల్దార్ సింగారావు ఎంపీడీవో కె.స్వరూపారాణి ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. గ్రామ సర్వేనెంబరు 299లో ఎకరా విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమిని కర్మాగార నిర్మాణానికి కేటాయించారు. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను తహసీల్దార్ సింగారావు ఎంపీడీవో స్వరూపారాణికి అందచేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, స్థానిక టీడీపీ నేత ఎనికపాటి శ్రీనివాసరావు, గ్రామ వీఆర్‌వో, సర్వేయర్‌తో పాటు పంచాయితీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

అవీ..ఇవీ..

హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



పూర్తి మరమ్మతులతో రూపుదిద్దుకున్న హిందూశ్మశాన వాటిక

పంగులూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని అలవలపాడు గ్రామ హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులను శుక్రవారం చేపట్టారు. 80సెంట్ల విస్తీర్ణం కలిగిన ఈ శ్మశానవాటిక వినియోగానికి ఆటంకంగా ఉన్న చిల్లచెట్ల ను తొలగించారు. పల్లంగా ఉన్న స్థలంమెరక చేసేందుకు 1500 ట్రక్కుల మట్టిని తరలించి చదునుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా శ్మశానవాటికను సుందరంగా తీర్చిదిద్దారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుమతితో శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు గ్రామ టీడీపీ నేత కోమటి ప్రసాద్ తెలిపారు.

కోలలపూడిలో 'సుపరిపాలనకు తొలిఅడుగు'



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న టీడీపీ నేతలు

మార్టూరు, జూలై4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా, 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ప్రజలు ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రజల కోసం, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. అంతేగాకుండా సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీర్ ఆత్మహత్యాయత్నం

- తీరం ఒడ్డున అపస్మారక స్థితిలోకి
- పర్యాటకులు గ్రహించి 108కు సమాచారం
- విషమంగా మార్టూరుకు చెందిన అనిల్ పరిస్థితి



అపస్మారక స్థితిలో అనిల్‌కుమార్

రామాపురం (చీరాల), జూలై 4 : రామాపురం సముద్రతీరంలో సివిల్ ఇంజనీర్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. అందిన వివరాల ప్రకారం మార్టూరు మండలం కోలలపూడి గ్రామానికి చెందిన బొబ్బేపల్లి అనిల్‌కుమార్ ఇటీవల సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. మరికొద్ది రోజుల్లో హైదారాబాదులో ఉద్యోగ ప్రయత్నాలకు వెళ్లనున్నాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ, శుక్రవారం ఉదయం తండ్రి శ్రీనివాసరావును అడిగి బయటకు వెళుతున్నట్లు చెప్పి ద్విచక్ర వాహనంపై రామాపురం తీరానికి వచ్చాడు. ఈక్రమంలోనే శీతల పానియంలో పురుగు మందు కలుపుకొని తాగి అపస్మారక స్థితికి చేరాడు. అనంతరం మిత్రులకు ఫోన్ ద్వారా మిస్ యూ అంటూ సందేశం పంపి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో ఒడ్డున పడి ఉన్న అనిల్ పరిస్థితి గుర్తించి పర్యాటకులు 108కు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన చీరాల ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే ఆయన తండ్రికి కూడా సమాచారం అందజేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

- చీరాల - స్వర్ణ రోడ్డులో ఘటన

చీరాల, జూలై 4 : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన చీరాల-స్వర్ణ దారిలో శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబం ధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం ఇడుపులపాడుకు చెందిన అందె ప్రసాద్ తన బావమరిది బిక్కి నాగేశ్వరరావును ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని చీరాల వైపు వస్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్ ఎడమ కాలుకు తీవ్ర గాయం కాగా, నాగేశ్వరరావు శరీరంపై పలుచోట్ల స్వల్పగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వేగంగా వచ్చి ఢీకొట్టిన ద్విచక్రవాహనంపై యువకులు అక్కడి నుంచి అంతేవేగంగా పారిపోయారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పర్చూరు, జులై 4 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక రామానాయుడు ప్రెస్‌వేల్ఫేర్ అసోషియేషన్ హాల్‌లో కౌలు రైతుసంఘం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి ప్రతి కౌలు రైతుకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించటంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. మిర్చిరైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమావేశంలో టి.శేషయ్య, రైతుసంఘం ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, కౌలురైతుసంఘం జిల్లా నాయకులు పి.కొండయ్య, భాను పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ప్రభుత్వ భవనాలు

- వృథా అవుతున్న కోట్లాది రూపాయల ప్రజాధనం
- గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతోనే ఈ దుస్థితి



కప్పుదశలో నిలిచి ఉన్న రైతు సేవా కేంద్రం

బల్లికురవ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రుపాయలతో గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ భవనాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అసంపూర్తి దశలో నిలిచి ఉన్నాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలో లక్షలు మంజూరు చేసినా, నేటికీ పనులు పూర్తికాలేదు. దీంతో ఇప్పుడు ప్రభుత్వ భవనాలు ప్రజలకు ఉపయోగపడకపోవడంతో పాటు నిధులు దుర్వినియోగం కూడా అయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలు ఉండగా 20 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. సచివాలయాలు ఉన్న అన్ని గ్రామాలలో, రైతుసేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల భవనాలను గత వైసీపీ ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో గ్రామానికి రూ. 79 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులు సకాలంలో ఇవ్వకపోవడంతో సగంపైన గ్రామాలలో ప్రభుత్వ భవనాల పనులు అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. కొన్ని గ్రామాలలో కప్పుదశలో మరి కొన్ని గ్రామాలలో వివిధ దశల్లో భవనాలు ఉన్నాయి. వీటికి స్వల్ప నిధులు కేటాయిస్తే తిరిగి భవనాలు అన్ని వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని వైదన గ్రామంలో రైతు సేవాకేంద్రం శ్లాబు వేసి వదిలేశారు. కొమ్మినేనివారిపాలెం గ్రామంలో రైతుసేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలు గ్రామానికి దూరంగా నిర్మాణ పనులు చేపట్టి కప్పువేసి పనులు నిలిపివేశారు. వల్లాపల్లి గ్రామంలో విలేజ్ హెల్త్‌క్లీనిక్ భవనానికి ప్లాస్టింగ్ చేయాల్సి ఉంది. అంబడిపూడి గ్రామంలో సచివాలయ భవనం, ప్లాస్టింగ్ చేయగా రైతుసేవా కేంద్రం కప్పువేసి పనులు నిలిపి వేశారు. కొణిదెన గ్రామంలో సచివాలయ, రైతుసేవా కేంద్రం భవనాలు అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. చెన్నుపల్లి గ్రామం లో సచివాలయ, రైతుసేవా కేంద్రం భవనాల పనులు నిలిచి ఉన్నాయి. ఉప్పుమాగు లూరు రెండవ సచివాలయం, వెలమవారిపాలెం, కొత్తూరు, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో కూడా ప్రభుత్వ భవనాల పనులు అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. ముందు ముందు ఈ భవనాలను వినియోగంలోకి తీసుకు రాకపోతే ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. గతంలో పనులు చేసిన వైసీపీ కాంట్రాక్టర్లు తిరిగి మరలా భవనాల పనులు చేసేందుకు ఇష్టంగా లేరని అధికారులు పూర్తిస్థాయిలో నిధుల వినియోగంపై విచారించి, వెంటనే అసంపూర్తి పనులతో నిలిచి ఉన్న ప్రభుత్వ భవనాల పనులు పూర్తి చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని గ్రామాలలో ప్రభుత్వ భవనాలు లేక అద్దెభవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు పని చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతుసేవా కేంద్రాలకు అద్దెలను ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.





అంబడిపూడిలో తుదిదశ నిర్మాణంలో వదిలేసిన సచివాలయ భవనం, వైదనలో అలంకార ప్రాయంగా ఉన్నరైతు సేవా కేంద్రం

స్ఫూర్తిప్రదాత కొణిజేటి రోశయ్య



రోశయ్య విగ్రహనికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 4 :స్ఫూర్తి ప్రదాత కొణిజేటి రోశయ్య అని, చీరాల అభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర అని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. శుక్రవారం చీరాలలో ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీసీ క్లాత్ మార్కెట్ వద్ద రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చీరాలలో రెండు దఫాలు ఎమ్మెల్యేగా పనిచేసి ఎనలేని సేవలు అందించినట్లు చెప్పారు. అంతేకాకుండా అన్ని సామాజిక వర్గాల మన్ననలు పొందారన్నారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు హాజరయ్యారు.



అద్దంకిలో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

అద్దంకిటౌన్ : మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా శుక్రవారం అద్దంకిలోని పాత గాంధిబొమ్మ కూడలిలోని రోశయ్య విగ్రహనికి అద్దంకిలోని ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకుడిగా, సీఎంగా, గవర్నర్‌గా రోశయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నాగమల్లి గుప్తా, ఉటుకూరి రామకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సుబ్బారాయుడు, పద్మేష్, చిన్ని, రఘురామగుప్తా, బాబు తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు దాణా పంపిణీ



పశువుల దాణాను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

మార్టూరు,జూలై 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో శుక్రవారం పశుపోషకులకు 50 శాతం రాయితీతో పశువులదాణాను మార్టూరు ఏడీ డాక్టరు ఆర్. శ్రీనివాసరావు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని 3 వేల గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసరావు రైతులు, పశుపోషకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పశువైద్యాధికారి మాధవీలత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏడీఆర్ శ్రీనివాసరావు రైతులతో మాట్లాడారు. పశుసంపదను పెంచవలసిన అవసరం ఉందన్నారు. గొర్రెలకు ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వపరంగా తమ సహకారం ఉంటుందన్నారు. అదేవిధంగా గేదెల పెంపకం కూడా పెరగాలన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు వీరవల్లి కృష్ణమూర్తి, గోపాలమిత్ర బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలి



సీసీరోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

సంతమాగులూరు జూలై 4 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా, మండలంలోని కామేపల్లి గ్రామానికి శుక్రవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వచ్చి ఉన్నారు, గ్రామంలో ఇటీవల రూ.40 లక్షలతో నూతనంగా నిర్మితమైన అంతర్గత సీసీరోడ్డును ప్రారంభించారు, అలాగే గ్రామంలో ఎంతోకాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీకి రూ.43 లక్షలతో నిర్మించనున్న జలజీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేశారు, గ్రామంలో ప్రభుత్వ పథకాలు అమలు తీరిపై ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు, ప్రభుత్వం పథకాలు అమలు తీరుపై గ్రామంలోని ప్రజలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొందరికి గ్యాస్ డబ్బులు, తల్లికి వందనం, పడలేదని తెలుసుకొని వారికి సంబంధించిన అధికారులకు సూచించి వారి సమస్య వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు, గ్రామంలో స్థానికంగా గ్రివెన్స్ నిర్వహించి వినతులను స్వీకరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పతి పేద వాడికి ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అరు లు ఆయన ప్రతి వారికి అందేవిధంగా చూడాలని అధికారులకు నాయకులకు తెలియజేశారు, ప్రజలకు ఏ కష్టం రాకుండా నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నాడు. అని అలాగే అధికారులు కూడా ప్రజలకు పథకాలు అందుతున్నాయా లేదా అనే దానిపై దృష్టిపెట్టాలని సూచించారు, గ్రామంలో ఏడుగురు దివాంగులకు ట్రైస్కూటీలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ జేఈ మస్తాన్ రావు, తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీఓ జ్యోతిర్మయి, మార్కెట్ యార్డ్‌చైర్మన్ తేలపోలు రమేష్, చేవూరు వాసిరెడ్డి, గ్రామ సర్పంచి గుండపనేని సురేష్, సత్యం, ఏడుకొండలు, చింత రామారావు, ఆలూరి శ్రీనివాసరావు, చిన్న గాలియ, గురుయాదవ్,, తదితర అధికారులు ఆయా గ్రామాల సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

చీరాల, జూలై 4 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని ఏపీపీ టీడీ ఎంప్లాయిస్ యూని యన్ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రావు, చీరాల డిపో కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ఉద్యోగులందరికీ ఉద్యోగోన్నతి కల్పించా లన్నారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీ ద్వారానే నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు శ్రీనివాసరావు, రవి, మహిళా ఉద్యోగులు సునీత, సుజాత, పుష్పవల్లి, కుసుమకుమారి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలి

అద్దంకిటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ కార్మికుల వివిధ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. శుక్రవారం ఆర్‌టీసీ డిపో ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వహీద్ మాట్లాడుతు సీఎం వద్ద ఉన్న ఉద్యోగోన్నతుల ఫైల్‌ను వెంటనే అనుమతివ్వాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కోనుగోలు చేయాలని, వాటిని ఆర్‌టీసీ సిబ్బందితోనే నడిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు, 11వ పీఆర్‌సీ అరియర్స్ 24 నెలల బకాయిలను వెంటనే ఉద్యోగులకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివశంకర్, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

రేపు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్

అద్దంకిటౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని ఏరియా పశువైద్యశాలలో ఈ నెల 6న జోనోసిస్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యశాల ఏడీ డాక్టర్ కేవీ.బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణం, పరిసర గ్రామాలలోని పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుండి పశువులకు సంక్రమించే వ్యాధులను జోనోటిక్ వ్యాధులు అని పిలుస్తారని, రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, క్యూ ఫ్రీవర్ వంటి వ్యాధులను జోనోటిక్ వ్యాధులు అని ఈ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పెంపుడు కుక్కలకు ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేయించుకుకోవాలని తెలిపారు.

తండ్రి కుమారుడు కత్తెరతో దాడి

- పింఛన్ డబ్బులు ఇవ్వలేదని ఘాతుకం

అద్దంకి,జూలై4(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ డబ్బులు ఖర్చులకు ఇవ్వాలని తండ్రిపై కుమారుడు కత్తెరతో దాడి చేసిన ఘటన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో చోటుచేసుకొంది. పట్టణంలోనిసాయిబాబా మందిరం సమీపంలో బాబాగుడి సమీపంలో నివాసం ఉండే వృద్ధుడు కమలనాథం స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన రోడ్డులో చెప్పుల దుకాణం నిర్వహించుకుంటు జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆయన కమారుడు నాగాంజనేయులు ఒంటిరిగా వేరుగా ఉంటున్నాడు ఇద్దరి మధ్య గతంలో పలు సార్లు గొడవలు జరిగాయి.. కమలనాథంకు ఇటీవల వృద్ధాప్య పింఛన్ డబ్బులు వచ్చాయి. శుక్రవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం పక్కరోడ్డులో చెప్పుల దుకాణంలో ఉన్న కమలనాథం వద్దకు కొడుకు వచ్చి ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఇచ్చేందుకు ఆయన నిరాకరించడంతో కత్తెరతో దాడి చేశాడు. దీంతో పలు చోట్ల గాయాలు అయ్యాయి. స్థానికులు కమలనాథంను ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న నాయకులు

చీరాల, జూలై 4 : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు పలువురు నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పెన్షన్ల కోసం 50, నివేశన స్థలాలు 100, ఇతర సమస్యలు 5 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మించాల సాంబశివరావు, గంజి పురుషోత్తం, ఆదినారాయణ, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కారంచేడు(పర్చూరు), జులై 4 (ఆంధ్రజ్యోతి) : నేడు కారంచేడు మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన ఉదయం 10గంటలకు జరుగుందని ఎంపీడీవో నేతాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మోహనరంగా జయంతి



చినగంజాంలో కేక్ కట్ చేస్తున్న కాపు నేతలు

పర్చూరు, జులై 4 (ఆంధ్రజ్యోతి) : దివంగత నేత వంగవీటి మోహనరంగా జయంతిని పర్చూరులో కాపు నేతలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బొమ్మల కూడలిలోని వంగవీటి విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు వంగవీటి గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో కోటా శ్రీనివాసరావు, కారంపూడి సందీప్ తేజ, తులసి అప్పారావు, దీర్ఘాల రమేష్ నాయుడు, రంగిశెట్టి అంజనేయుడు, కోట.హరిప్రసాద్, ఒగ్గిశెట్టి నరసింహం, కఠారి శ్రీదర్‌బాబు, మోహన్, శీలం కుమార్, కందా సరేంద్రబాబు, తులసి శ్రీనివాసరావు, తోట మణి, కాయల అజేయ్, తులసి నాగు, గోగుల శ్రీను, మారుతి, సతీష్ అచ్చికోలు, దాసరి సాంబయ్య పాల్గొన్నారు.



పర్చూరులో నివాళి అర్పిస్తున్న నేతలు

చినగంజాం : విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోపిరాల గ్రామంలో మాజీ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామకూటమి నాయకులు మోహనరంగా జయంతి వేడుకల జరిపారు. స్థానిక సోపిరాల రంగా సెంటర్‌లోని ఆయన విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళిలర్పించారు. అనంతరం కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో తుమ్మల పెంట సీతారామయ్య, ఆమంచి వెంకటసుబ్బారావు, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, చెరుకూరి రాఘవయ్య, పర్వతరెడ్డి .నరేంద్రనాథ్, పి.హరిబాబు, శిఖరం కోటయ్య, ఎస్.హరనాథ్‌బాబు, పల్ల పోలు లక్ష్మినారామణ, సందు శ్రీరామ్, గంటా చెన్నయ్య, పి.పార్థసారిథి, పి.పద్మనాభయ్య, శిఖరం రాంబాబు, నరహరి శ్రీనివాసరావు, టీ.సతీష్ కుమార్, ఎస్.గోపినాథ్, టీ.సుబ్బారావు, ఎ.శ్రీనివాసరావు, మోహనరావు, టీ.బాపయ్య, పాల్గొన్నారు.

పంగులూరు :మండలంలోని చందలూరు గ్రామంలో వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఊరచెరువు సమీపంలోని మోహనరంగా విగ్రహానికి స్థానిక నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రేపల్లె సురేష్, కసుకుర్తి సత్యనారాయణ, వట్టెం శేషయ్య, కనకచంద్రరావు, పాలెపు వీరాంజనేయులు, లక్ష్మయ్య, అనంతరాధాకృష్ణ, అంకమ్మ పంతులు పాల్గొన్నారు.



గ్రామసభలో రైతులను నిలువరిస్తున్న పోలీసులు



తన వాదనను అధికారులకు వివరిస్తున్న మహిళ

ఉత్కంఠ.. ఉద్రిక్తత!

- కరేడులో రసాభాసగా గ్రామసభ
- భూములు ఇచ్చేదేలేదన్న రైతులు, గ్రామస్థులు
- బెడిసికొట్టిన అధికారుల వ్యూహం
- చేసేదిలేక అర్ధంతరంగా సభ ముగింపు
- ప్రజల మాటలనే ప్రభుత్వానికి నివేదిస్తామని ప్రకటన

ఎట్టి పరిస్థితుల్లోనూ పచ్చని పొలాలను ఇండోసోల్ సోలార్ పరిశ్రమ పరిశ్రమకు ఇచ్చేదేలేదు.. అవసరమైతే అధికారులను నిలదీద్దామంటూ కరేడు గ్రామస్థులు, రైతుల ఆక్రోశం.. ప్రజలకు ఏమని చెప్పి భూసేకరణకు ఒప్పించాలి. కర్షకుల ఆగ్రహం ఎటు దారి తీస్తుందోనని అధికార యంత్రాగం ఆందోళన..

వెరసి కరేడు గ్రామంలో శుక్రవారం క్షణక్షణం ఉత్కంఠగా మారింది. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా కందుకూరు, కావలి డివిజన్లకు చెందిన 100 మందికిపైగా పోలీసులను ఉదయాన్నే గ్రామంలో మోహరింపజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ రెవెన్యూ సిబ్బందితో కలిసి కరేడు గ్రామానికి చేరుకున్నారు. వీరు వేదికపై కూర్చొనేలోపే 'చావనైనా చస్తాం కానీ మా భూములు మాత్రం వదులుకోం. మాకు గ్రామ సభలు అవసరం లేదంటూ రైతులు పెట్టిన గగ్గోలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. ఒకదశలో రైతులను అదుపు చేయడం పోలీసులకు కూడా సాధ్యం కాలేదు. ముఖ్యంగా సముద్ర తీర గ్రామాల మత్స్యకార మహిళలు 'ఏటా రెండుకార్లు పంటలు పండించే భూములు, తిండికి కరువైన నాడు మమ్మల్ని ఆదుకున్నా. అలాంటి భూములను వదులుకునే ప్రసక్తే లేదంటూ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

ఎలాగైనా సభ నిర్వహించాలని..

ప్రభుత్వం నిర్దేశించిన టాస్క్‌ను పూర్తి చేసి ఇండోసోల్ పరిశ్రమ కోసం విడుదల చేసిన భూసేకరణ చేయాలని అధికారులు ప్రయత్నం గ్రామస్థుల తిరుగుబాటు ముందు పని చేయలేదు. గ్రామస్థులు, రైతులు, మహిళలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్ల నమిలారు. కనీసం ప్రభుత్వం ఏం చెప్పాలనుకుందో వివరించేందుకు ప్రయత్నించినా ప్రజలు ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇలాగే కొనసాగితే పరిస్థితులు చేయి దాటిపోతాయని గ్రహించిన అధికారులు రైతుల ఆగ్రహానికి తలవంచక తప్పలేదు.



రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, సబ్‌కలెక్టర్ శ్రీపూజ

మీ మాటలనే నివేదిస్తాం

స్థానికంగా ఉన్న రైతులు, మత్స్యకారులు, శివారు గ్రామాల ప్రజల మనోభావాలను దెబ్బతీసి వారి జీవనోపాధికి భంగం కలిగించే భూసేకరణపై మీ మాటలనే యథావిధిగా ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు హామీ కూడా ఇవ్వడంతో రైతులు శాంతించారు. అధికారులు కూడా గ్రామసభను ముగించి, తిరుగుప్రయాణమయ్యారు.

- ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)

రైతులకు అండగా ఉంటా: ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

ఉలవపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా కరేడు రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు. గ్రామసభలో రైతులు, గ్రామస్థుల ఆవేదనను ప్రత్యక్షంగా చూసిన ఆయన మాట్లాడుతూ రైతులు, గ్రామస్థులకు అండగా తాను కూడా తన పరిధిలో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని స్పష్టం చేశారు. ఇటీవల కరేడు రైతులు, గ్రామస్థులు చేపట్టిన హైవే దిగ్బంధంపై పోలీసులు 38 మందిపై కేసులు బనాయించడం దారుణమని అన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సబ్‌కలెక్టర్ శ్రీపూజను కోరారు. తనవంతుగా హోం మంత్రి, డీజీపీలను కలిసి రైతులపై పెట్టిన కేసులపై చర్చించి తీయించే విధంగా కృషి చేస్తానన్నారు.

పంటలకు బీమా.. రైతులకు ధీమా..

- ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగకు వర్తింపు

ఉదయగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశగ పంటలకు బీమా చేసుకునే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణం పొందిన వారికి బీమా నేరుగా లభిస్తుంది. రుణాలు పొందని రైతులు తుపాన్లు, కరువు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే వాతావరణ అంశాల ఆధారంగా బీమా పరిహారం చెల్లిస్తారు. వరి, వేరుశనగ పంటలకు నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న రైతులతోపాటు కౌలు రైతులూ అర్హులని అధికారులు తెలిపారు.

ప్రీమియం ఇలా..

వరి పంటకు సంబంధించి గ్రామ యూనిట్‌గా రైతులు ఎకరాకు రూ.840 చెల్లించాలి. ప్రకృతి వైపరీత్యాల నష్టం వాటిల్లితే బాధిత రైతుకు రూ.42,000 చెల్లిస్తారు. ఆగస్టు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ఇక వేరుశనగకు మండల యూనిట్‌గా ఎకరాకు రూ.280 ప్రీమియం చెల్లించాలి. రూ.28వేల పరిహారం చెల్లిస్తారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి రైతులను కోరారు.



సాగులో వేరుశనగ పంట

స్పౌజ్ పింఛన్ల సొమ్ము వెనక్కి!

కలువాయి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా మంజూరైన స్పౌజ్ (భర్త మరణిస్తే భార్యకు ఇచ్చే) పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును అధికారులు తిరిగి ప్రభుత్వ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. కలువాయి మండలంలో 80 స్పౌజ్ పింఛన్లు మంజూరవగా, ఆయా పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమ చేసింది. అయితే, అనూహ్యంగా ఈ పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శులు శుక్రవారం ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. పింఛన్ల సొమ్ము చేతికి వస్తుందని ఎంతో ఆశగా ఎదురుసిన వితంతువుల ఆశలు ఆవిరయ్యాయి.

సమన్వయంతో రొట్టెల పండుగను విజయవంతం చేయండి

- భక్తులకు ఏలోటూ రానీయొద్దు
- అధికారుల సమీక్షలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



అధికారుల సమీక్షలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండుగలో విధులు కేటాయించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం బారాషహీద్ దర్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. పండుగ జరిగే ఐదు రోజులూ 24/7 విధులు నిర్వహించేలా సిబ్బందిని నియమించాలని, సదరు వివరాలను జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. ఘాట్‌ల నిర్వహణలో అలసత్వం వహించొద్దని, అవసరమైనన్ని సీసీటీవీలు అమర్చుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, మరుగుదొడ్లు, పారిశుధ్యం మెరుగు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కలగకుండా చర్యలు తీసుకోవాలని, వైద్య, ఆరోగ్య శాఖ ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. దర్గా ప్రాంగణంలో ప్రణాళిక ప్రకారం స్టాల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్‌లతో ఆయన కలిసి దర్గా, స్వర్ణాల చెరువు వద్ద ఘాట్‌లను, బారికేడ్‌ల ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గురుకుల్లాలో ఔట్‌సోర్సింగ్ టీచర్లకు గౌరవ వేతనం పెంపు!

నెల్లూరు (హరనాథపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి వేతనాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 12 గిరిజన సంక్షేమ గురుకులు ఉండగా, 2,944 విద్యార్థులు చదువుతున్నారు. 79 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉండగా, ఒక్కొక్కరికి రూ.14,800 గౌరవవేతం అందుతోంది. ఈ వేతనం రూ.19,350లకు పెరిగింది. ఆ విద్యాలయాల్లోనే పోస్టు గ్రాడ్యుయేట్ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ముగ్గురు పని చేస్తున్నారు. వీరికి ప్రస్తుతం రూ. 16,100 వేతనం ఉండగా, 24,150లకు పెరిగింది. నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో నెల్లూరు, చిత్తూరు, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాలు ఉండగా, 45 గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 9,708 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గ్రాడ్యుయేట్ టీచర్లు 268, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు 25మంది, జూనియర్ లెక్చరర్లు 11 మంది పని చేస్తున్నారు. కాగా, జూనియర్ లెక్చరర్లు జిల్లాలో లేకపోయినా తిరుపతి జిల్లాలో ఉన్నారు. వీరికి గౌరవవేతనం రూ.18వేల నుంచి 24,150లకు పెరిగింది. ఐటీడీఏ పీడీ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, అందుకు తగ్గట్టు ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు గౌరవవేతనం పెంచడం అందరిలో ఆనందం నింపినట్లు అయ్యిందని అన్నారు.



గురుకులంలో విద్యాబోధన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయిని

ఇక టీచర్ల హాజరుపై గురి

- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బడుల్లో ఉండాల్సిందే!
- యాప్‌లో నమోదు తప్పనిసరి
- పక్కాగా పాఠశాలల మార్గదర్శకాలు అమలు

పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ హాజరుపై గురిపెట్టాలి. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే యాప్‌లో హాజరు నమోదు చేయాలి. 9.30 గంటలకు హాజరు నివేదిక తనకు సమర్పించాలి. బోగస్ హాజరు నమోదు కాకుండా డీఈఓతోపాటు డిప్యూటీఈఓలు, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు సమావేశాలు నిర్వహించి హాజరుపై స్పష్టమైన ఆదేశాలివ్వాలి. జూలై 10 తరువాత నా తనిఖీల్లో బోగస్ హాజరు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు.

- విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షలో పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు



యాప్‌లో అటెండెన్స్ వేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఉపాధ్యాయుల సమయ పాలనపై విద్యా శాఖ దృష్టి సారించింది. విద్యార్థులకు కిట్ల పంపిణీ, ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల విధులకు సంబంధించి పక్కాగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు జూలై 1వ తేదీ నుంచి పాఠశాలల నిర్వహణపై విద్యాశాఖ రూపొందించే మార్గదర్శకాలను అమలు చేయనున్నారు. త్వరలోనే టీచర్లకు ఫండమెంటల్ లెర్నింగ్ పేరుతో శిక్షణ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. టీచర్లంతా ఉదయం 9 గంటలకే పాఠశాలలకు హాజరు కావాలని, సాయంత్రం 4 గంటల వరకు ఖచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ఉపాధ్యాయుడు, విద్యార్థి హాజరు పూర్తి చేయాలి. ప్రక్రియ పూర్తి చేయకపోతే వెంటనే ఎంఈఓ నుంచి సమాచారం తెప్పించుకోవాలి. పాఠశాలల్లో సమావేశాలు సాయంత్రం 4 గంటల తరువాతనే నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

జీతాలకు లైన్ క్లియర్

జిల్లాలో జరిగిన ఉద్యోగోన్నతులు, బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు, పాఠశాలలకు బదిలీ అయిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల జీతాలు చెల్లించేందుకు లైన్ క్లియర్ అయినట్లు అధికారులు తెలిపారు. పాఠశాలల కొత్త కేడర్ స్ట్రెంగ్త్ డీఈఓ కార్యాలయం ఐటీసెల్‌కు వచ్చింది. ఆన్‌లైన్‌లో ఏ టీచర్ పాఠశాల నుంచి ఏ పాఠశాలకు బదిలీ అయిన వివరాలు, టీచర్ల ట్రెజరీ ఐడీ నెంబర్ కూడా ఉండడంతో నిర్ధారణ తేలికగా పూర్తి చేశారన్నారు. కొత్త కేడర్ వివరాలను ధ్రువీకరించి పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం నుంచి ట్రెజరీ కార్యాలయానికి పంపించామన్నారు. ఈ వివరాలు డీటీఏ నుంచి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి చేరుతున్నాయని, వెంటనే జీతాల బిల్లుల మంజూరుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పునర్వవస్థీకరణలో భాగంగా యూపీ స్కూల్స్ నుంచి అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లోని హెచ్‌ఎం, టీచర్లకు సంబంధించి కొత్తగా డీడీఓ కోడ్ నెంబర్లను కేటాయిస్తురు. అలాగే ఆదర్శ పాఠశాలల్లో పీఎస్‌హెచ్‌ఎంలు, ఎస్‌జీటీల వివరాలన్నీ అప్‌డేట్ చేస్తున్నారని, అందరికీ ఈనెలలోనే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అధికారులు తెలిపారు.

కమిషనర్ ప్రతిరోజూ సమావేశం

పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ కమిషనర్ నిత్యం ఉదయం పది గంటలకు ఆర్జేడీలు, డీఈఓలు, డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలతో జులై 1వ తేదీ నుంచి వెబెక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, టీచర్ల పనితీరు, హాజరు, సమయపాలన అంశాలపై మానటరింగ్ చేసేలా కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ సిబ్బంది, టీచర్లు సమయపాలన పాటించి పాఠశాలల ఉన్నతికి పాటుపడాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జూలై 1వ తేదీ జిల్లాలో 97.5 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 590

సాగునీటి కాలువల అభివృద్ధికి కృషి : ఎస్ఈ

అల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రధాన కాలువలను అభివృద్ధి చేయడంతోపాటు పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఎస్ఈ దేశ్‌నాయక్ అన్నారు. అల్లూరు చెరువు ఆయకట్టుకు సాగునీరందించే ఏటిఎస్ ఛానల్ కాలువతోపాటు పలు కాలువలను, మట్టాలను శుక్రవారం సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిఎస్ ఛానల్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయడానికి బదులు కట్టలు బలహీనంగా ఉండడంతో 300 క్యూసెక్కులను మాత్రమే సరఫరా చేయాల్సి వస్తోందన్నారు. పలు షట్టర్లు దెబ్బతిన్నాయని, వాటిని మరమ్మతులు చేయడంతోపాటు కట్టలను పటిష్టపరచేందుకు నివేదికలను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డిఈ పెంచలయ్య, ఏఈ సుదీర్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ మేడా కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రేబాల శంకర్‌రెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, నీలప రెడ్డి హరీష్‌రెడ్డి, అంబటి రాజేంద్ర, ఆట తిరుమల, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఆర్ జయంతి వేడుకలు

కావలి,జూలై4(ఆంధ్రజ్యోతి): విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) జయంతి వేడుకలు శుక్రవారం కావలిలో పలు సేవాసంస్థల బాధ్యులు నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ బాధ్యులు డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ రవిప్రకాష్, అలహరి శ్రీనివాస కుమార్, డాక్టర్ కే మాధవరెడ్డి, డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ టీ రమ్య, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఏ రమేష్‌రెడ్డి, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ నళిని పద్మ పాల్గొన్నారు.

డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో..

డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి పట్టణ జొన్నాయిగుంట, గాయత్రీనగర్, ఇస్లాంపేట అంగన్‌వాడీ సంయుక్త కేంద్రాలలో డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ ఛైర్మన్ కూనం తాతిరెడ్డి, జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు ఆటల పోటీల అనంతరం బహుమతులు అందచేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వలేటివారిపాలెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సన్నజీవాల పెంపకందారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పోకూరు పశువైద్యాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలోని నలదలపూరులో శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణా మందును స్థానిక టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన్నం కృష్ణ, మన్నం సుబ్బారావు, నవ్వులూరి కృష్ణయ్య, అత్తోటి సురేష్, నవ్వులూరి అంకయ్య, అత్తోటి రవి, తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల కోసం ఎదురుచూపులు

- మంజూరు కాని నిధులు
- ఎంపిక కాని లబ్ధిదారులు



లింగసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఇంటి నిర్మాణం కోసం వేసిన పునాది

లింగసముద్రం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏవై-20 ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళన చెందుతున్నారు.గత ఏడాది డిసెంబరులో కేంద్రం ఈ పథకం కింద మండలానికి పక్కా గృహాలు మంజూరు చేసిందని, పక్కా గృహాలు లేకుండా సొంత ఇంటి స్థలం కలవారు కూడా దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు డివిజన్, లింగసముద్రం మండల అధికారులు గ్రామాల ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం కింద ఎస్టీ లబ్ధిదారులకు రూ.3.75 లక్షలు, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.3 లక్షలు, ఓసీ లబ్ధిదారులకు రూ2.50 లక్షలు మంజూరవుతాయని చెప్పారు.దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో పక్కా గృహాలు లేని వారు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులను గృహనిర్మాణశాఖ సిబ్బందికి అందజేశారు. అయితే స్థానిక రెవెన్యూ అధికారులు ఈ దరఖాస్తుదారుల్లో 850 మందికిపైగా పొజిషన్ సర్టిఫికెట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఇచ్చినట్టు తెలిసింది.అయితే దరఖాస్తుదారులు చాలా మంది తమకు పక్కా గృహం వచ్చినట్టేనని భావించి, పక్కా గృహ నిర్మాణం కోసం పునాదులు వేసుకున్నారు. అయితే వాస్తవానికి ఈ పథకం కింద కేంద్రం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. దీంతో పక్కా గృహాలకు నిధులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక అధికారులు సతమతమౌతున్నారు. అంతేగాక దరఖాస్తుదా రులకు సమాధానం చెప్పలేక పోతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఇంటూరి జన్మదినం



కందుకూరులో కేక్ కట్ చేస్తున్ననాయకులు



వలేటివారిపాలెం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు 49వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతల సమక్షంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. మహిళలకు పట్టుమిషన్లు పంపిణీ చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్‌లోని అన్నా క్యాంటీన్ వద్ద కూడా కేక్ కట్ చేసి పేదలకు భోజనం అందజేశారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు, కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. అంకమ్మ అమ్మవారి ఆలయంలో పార్టీ నాయకులు కొడాలి కోటేశ్వర రావు, పిడికిటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పుపాలెంలోని బంగారమ్మ అమ్మవారి ఆలయంలోనూ 17వ వార్డు నాయకులు పూజలు నిర్వహించారు. శారదా నిలయం పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే పార్టీ నాయకులు సోమినేని రవీంద్ర, తలతోటి మస్తాన్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఇంటూరి అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బుస్సారెడ్డి కృష్ణా రెడ్డి, గుర్రం మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు ప్రవీణ్ పాల్గొన్నారు.

గుడ్లూరు: ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వద్ద టీడీపీ నాయ కులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉన్నం వెంక టేశ్వర్లు, నాయకులు చెన్నారెడ్డి మహేష్, చెరుకూరి సూర్యనారాయణ, చిత్తారి మల్లికార్జున పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి జన సేన పార్టీ మండల నాయకులు సనిశెట్టి గిరిబాబు ఆధ్వ ర్యంలో గడియారాన్ని కార్యాలయ సిబ్బందికి శుక్రవారం బహూకరించారు.

వలేటివారిపాలెం: టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహం ఇతర టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు గొట్టిపాటి హరికృష్ణ, వలేటి మధు సూధన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం పాల్గొన్నారు.

ఉలవపాడు: టీడీపీ మం డల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు, చాగొల్లు, కృష్ణాపురం గ్రామాల్లో కేక్ కట్ చేశారు.

లింగసముద్రం: టీడీపీ మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాధం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, అంగులూరి చినకొండయ్య, షేక్ నాయబ్‌రసూల్ పొలిమేర చిననాగిరెడ్డి బీ. కొండపనాయుడు, అడపా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

474 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 570 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకురాగా వేలంలో 9 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 474 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-75, ఆర్ఆర్-10, సీఆర్-6, జంపింగ్ లాట్స్-5 కారణాలతో 96 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.211.52గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి

కావలి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. కావలి మండలం చెంచుగానిపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్ర వారం తనిఖీచేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను గ్రామంలోని రోడ్ల వెంట పోసి వ్యాధులకు కారణం కాకుండా చెత్త సేకరణకు వచ్చే గ్రీన్ అంబాసి డర్లకు అందచేయాలన్నారు. తద్వారా చెత్తతో వచ్చే వర్మీ కంపోస్టు ఎరువును రాయితీతో రైతులకు అందించి పంచాయతీలకు సంపద సృష్టించటం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయమ్మ స్థానిక టీడీపీ నాయకుడు నాశిన జాలరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు పోసిన శ్రీనివాసులు, తాతా హరిబాబు, బండ్ల రవీంద్ర, బండ్ల రాఘవులు, పోసిన వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్‌రంగా జయంతి

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు శుక్రవారం కావలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఉన్న రంగా విగ్రహానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితోపాటు కాపునేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, రంగా విగ్రహకమిటీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసులు, కాపునేతలు ఆలా శ్రీనివాసులు, మాల్యాద్రి పాల్గొన్నారు.

'కార్పొరేట్' కోసం భూములు లాక్కోవడం దారుణం

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉలవ పాడు మండలంలోని కరేడు, గుడ్లూరు మం డలంలోని పలు గ్రామాల్లోనూ ఇండోసోల్ కంపెనీ కోసం పంటలు పండే భూములను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం దారుణమని నియోజకవర్గ అభివృద్ధి మండలి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, అభివృద్ధి మండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. స్పెషల్ పార్టీ పోలీసులను పంపించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి రైతుల భూములను లాక్కోవాలని జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రతిఘటించి తీరుతామన్నారు.

యువ ఇంజనీర్లు నూతన సాంకేతికత అలవర్చుకోవాలి

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న వీసీ సుదర్శనరావు తదితరులు

కావలి (టౌన్), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నేటితరం యువ ఇంజనీర్లు నూతన సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని జెఎన్‌టీయూ (అనంతపురం) ఉపకులపతి (వీసీ) ప్రొఫెసర్ హెచ్ సుదర్శనరావు పేర్కొన్నారు. కావలిలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి స్నాతకోత్సవం శుక్రవారం కేవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆ సంస్థ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ నూతన ఆలోచలతో కొత్త ఒరవడికి నాంది పలకాలని, అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఛైర్మన్ విద్యాధర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల స్వయం ప్రతిపత్తి హోదా సాధించిన కొద్ది కాలానికే విద్యార్థులూ జేఎన్‌టీయూ పరిధిలో ఉన్నత ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, జేఎన్‌టీయూ ప్రతినిధి డాక్టర్ మాధవి, ఎస్వీయూ ప్రతినిధి డాక్టర్ మురళీ, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డి, ఇన్‌చార్జ్ లిఖిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే దగుమాటి పరామర్శ



అన్నపూర్ణమ్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో మృతిచెందిన, అనారోగ్యంతో ఉన్న పలు కుటుంబాలను శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. కావలి మాజీ ఏఎంసీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాతృమూర్తి అన్నపూర్ణమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో కావలిలోని వారి నివాసానికి వెళ్లి ఆమె పార్థీవ దేహానికి నివాళులు అర్పించి సుకుమార్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం వస్త్రవ్యాపారి వేమూరి పెద్దులు సతీమణి ప్రమీలమ్మ ఇటీవల మృతిచెందడంతో స్థానిక బృందావనం కాలనీలోని ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే టీడీపీ కార్యకర్త గంగిరెడ్డి ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మద్దూరుపాడులోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పమిడి రవికుమార్‌చౌదరి, పోతుగంటి అలేఖ్య, తటవర్తి రమేష్, శ్రీరాం మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేతలే వారి ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించి సుపరిపాలన అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావలి పట్టణం 8వ వార్డులోని చింతంవారి వీధిలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇప్పటివరకు అర్హులకు ఏఏ పథకాలు అందాయో తెలుసుకుని త్వరలో అందించబోయే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, మొగిలి కల్లయ్య, అమరా వేదగిరి క్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు కో కన్వీనర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

చింతంవారి వీధిలో సీసీ రోడ్డు, డ్రైన్లు నిర్మాణాలకు రూ.22 లక్షలు మంజూరుచేసి ఆ పనులకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్‌తో కలిసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు.

బోగోలులో ...

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేల్లపల్లి సుధీర్‌బాబు విశ్వనాథరావుపేటలో, బిట్రగుంట పంచాయతీలో ఆర్ విజయ్‌కుమార్, కే బసిరెడ్డి, వాకా మహేష్‌రెడ్డి, తాళ్ళూరులో యూనిట్ ఇన్‌చార్జి పులి మహేష్, సుబ్బారావు, శ్రీనివాసులు తదితరులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కే వెంకటేశ్వరరెడ్డి, పీ శ్రీధర్, టీ ప్రసాద్, షేక్ రఫీ, నరసింహారావు, బీ ప్రభాకర్‌రెడ్డి, ఏ ప్రసాద్, అఖీల్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కలిగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని క్రాకుటూరు గ్రామానికి చెందిన మన్నేటి దేవమ్మకు వింజమూరు సమీపంలోని బొమ్మరాజుచెరువు గ్రామం వద్ద క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ 6లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు జరిమానాలు

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ లేకపోయినా, పత్రాలు సరిగ్గా లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీఎన్ లక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని స్కూల్ బస్సులపై శుక్రవారం ఎంవీఐ జే. అనిల్‌కుమార్‌తో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీ చేశారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం మండలంలోని సాయిపేట, కొమ్మి, కొండాపురం కాంప్లెక్స్‌లలో జరిగింది. ఈ సందర్భంగా ఆశాఖ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు గాలంకి మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఐఆర్‌ను వెంటనే ప్రకటించి పాత, కొత్త డీఏలను ప్రకటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆశాఖ మండల ప్రధాన కార్యదర్శి బి మధు, పదర్ల శ్రీనివాసులు, కోశాధికారి డి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



కొండాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన పూర్వ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మాల్యాద్రి, రామక్రిష్ణ, జ్యోతిలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మ నేత్రదానం



మన్నెమాల అన్నపూర్ణమ్మ (ఫైల్)

కావలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఏఎంసీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి మాతృమూర్తి మన్నెమాల అన్నపూర్ణమ్మ గురువారం రాత్రి మృతిచెందగా మరణానంతరం నేత్రదానం చేశారు. ఆమె మరణించిన వెంటనే తనయుడు సుకుమార్ రెడ్డి రెడ్‌క్రాస్ సభ్యులకు సమాచారం ఇచ్చి తమ తల్లి కార్నియాలను సేకరించాలని కోరారు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ టెక్నిషియన్ సునీల్ తమ సిబ్బందితో శుక్రవారం కావలికి వచ్చి కార్నియాలను సేకరించారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, అభయం సేవా సంస్థ నిర్వాహకురాలు ఇలింద్ర శ్రీవాణి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి నేత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా తల్లి నేత్రాలను దానం చేసిన సుకుమార్ రెడ్డికి రెడ్‌క్రాస్, అభయం బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ కార్యాలయంలో అల్లూరి జయంతి



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల సురేష్, మాల్యాద్రినాయుడు, ముప్పల భూషయ్య, ఉన్నం భాస్కరరావు, తానికొండ కోటయ్య, నాగినేని ప్రసాద్, డాక్టరు తిరుమలరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామయ్యకు దగ్గుబాటి పురంధరేశ్వరి నివాళులు



కంచర్ల రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ఎంపీ, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి శుక్రవారం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్యకు నివాళులర్పించారు. రామయ్య సతీమణి కంచర్ల ధనలక్ష్మీ, కుమారులైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, విజయ్ శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా దగ్గుబాటి కుటుంబంతో రామయ్యకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

ఐచ్ఛిక సెలవులపై నియంత్రణ సరికాదు

కందుకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సర క్యాలెండర్‌లో ప్రకటించిన ఐచ్ఛిక సెలవులను వాడుకోవటంలో ప్రభుత్వ నియంత్రణ సరికాదని, ఈసెలవులను పూర్తిగా వాడుకోవడానికి ప్రభుత్వం అనుమతించాలని బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విధించిన నియంత్రణలతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని ఆయన ప్రకటనలో తెలిపారు.

11 నుంచి రెవెన్యూ క్రీడలు

• 3 రోజులపాటు నెల్లూరులో నిర్వహణ

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే రెవెన్యూ ఉద్యోగుల కోసం ఈ నెల 11 నుంచి క్రీడా పోటీలు జరగనున్నాయి. జిల్లాలో 10వ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు కలెక్టర్ ఆనంద్ అనుమతి ఇచ్చారు. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడమేగాక, పరస్పర సన్నిహితతకు, బృందభావనకు, ఉద్యోగుల మధ్య స్నేహభావనకు ఈ క్రీడలు దోహదపడతాయి. 13వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రికెట్, కబడ్డీ, లెమన్ స్పూన్, టగ్‌ఆఫ్ వార్, వాలీబాల్, జావెలెన్ త్రో, చెస్ వంటి పోటీలు జరుగుతాయి.


రెవెన్యూ అధికారులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

● వీపీఆర్ రూ.11 లక్షల సాయం

రెవెన్యూ క్రీడోత్సవాల నిర్వహణకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.11 లక్షల ఆర్థిక సాయాన్ని అందచేశారు. అంతేగాక క్రీడా దుస్తులనూ అందచేయడానికి అంగీకరించారు. ఈ ఆర్థిక సహాయ చెక్కును వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తన నివాసంలో రెవెన్యూ అధికారులకు, ఏపీ ఆర్ఎస్ఏ నాయకులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను ప్రారంభించిన ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పోలీసుశాఖకు కేటాయించిన ద్విచక్ర వాహనాల్లో డీజీపీ కార్యాలయం నెల్లూరు జిల్లాకు 20 వాహనాలను కేటాయించింది. ఆ వాహనాలను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు అందించిన ద్విచక్రవాహనాలు ట్రాఫిక్ నియంత్రనకు ఎంతగానో తోడ్పాటును అందిస్తాయన్నారు. ఈ వాహనాలను నెల్లూరు ట్రాఫిక్, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్ డివిజన్‌లకు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

20న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చెస్ దినోత్సవం, ఫిడే 101వ వ్యవస్థాపక దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన నగరంలోని ఎంజీబీ మాల్‌లో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వైసుమన్ తెలిపారు. నగరంలోని ఎంజీబీ మాల్‌లో శుక్రవారం చెస్ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్తగా ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. దేశంలోని ప్రతిభావంతులైన చెస్ క్రీడాకారులకు అద్భుతమైన వేదికలను ఏర్పాటు చేస్తూ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్జాతీయ చెస్ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. క్రీడాకారులు పోటీల్లో సత్తా చాటి క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీబీ ఎండీ డాక్టర్ గోపాలకృష్ణ, డీజీఎం మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ, చెస్ వింగ్స్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపీ నాథ్, చెస్ కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్‌వో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా సైన్స్ ప్రదర్శనశాలలో సైన్స్ అధికారి పోస్టుకు డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ సైన్స్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ సర్‌ప్లస్‌గా ఉన్న అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు వారి దరఖాస్తును ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈవో కార్యాలయానికి ఈనెల 10వ తేదీ లోపు అందచేయాలని తెలిపారు.

నేడు పీసీసీఎఫ్ పర్యటన

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) అజయ్‌కుమార్ నాయక్ రెండు రోజు జిల్లా పర్యటనకు శనివారం రానున్నారు. మొదటి రోజు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. రెండో రోజు ఆదివారం నగర వనంతోపాటు జిల్లాలోని పలు అటవీ ప్లానిటేషన్లను పరిశీలించనున్నారు.

సోమశిలలో 30.620 టీఎంసీల నీరు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 194 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 30.620 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 850, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వెయ్యి మందికి సెల్‌ఫోన్లు అప్పగింత

నెల్లూరు(క్రైం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కోటి రూపాయల విలువ చేసే వెయ్యి సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ శుక్రవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌హంట్ అప్లికేషన్ సేవలు ప్రజల విశ్వాసాన్ని అందుకుంటూ అమోఘంగా కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 8 విడతల్లో రూ.4 కోట్లు విలువ చేసే 3,900 సెల్‌ఫోన్లను బాధితులకు అందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రూ.6 లక్షల విలువ చేసే 60 ఫోన్లు బాధితులకు అందించామన్నారు. బిల్ లేకుండా, సెకండ్ హ్యాండ్‌లో మొబైల్ ఫోన్లు కొనకూడదన్నారు. ఫోన్ పోయిన వారు తమ మొబైల్ నెంబర్ నుంచి 9154305600కి వాట్సప్ ద్వారా మెసేజ్ పంపితే గూగుల్ ఫారమ్ లింక్ వస్తుందని, దానిని పూరించి పంపితే మొబైల్ హంట్‌లో కేసు రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. మొబైల్ దొరికిన తర్వాత పోలీసులు బాధితులకు తిరిగి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, సైబర్‌క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.


బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

ద్రౌపదీ దేవికి మాన సంరక్షణ అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేటలో జరుగుతున్న ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు 10వ రోజు శుక్రవారం విజయవంతంగా జరిగాయి. రాత్రి మాన సంరక్షణ అలంకారం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చి ద్రౌపదీదేవిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం భగవద్గీత పారాయణం, హోమం, చప్పర ఉత్సవం జరిగింది. సాయంత్రం పూలంగిసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.





● నేడు తపస్సుమాను ఉత్సవం

బ్రహ్మోత్సవాల్లో కీలకమైన పెద్దదైన తపస్సుమాను ఉత్సవం శనివారం రాత్రి జరుగుతుందని శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయ ఈవో యు.జానకి తెలిపారు. తపస్సుమాను ఉత్సవం అంటే శివుని మెప్పించి అర్జునుడు పాశుపతాస్త్రం పొందే ఘట్టంను ఈ ఉత్సవంలో ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్వతంపై అర్జునుడు లక్ష్యసాధన కోసం తపస్సు చేసినట్లు తపస్సు మానుపైకి అర్జున వేషధారణలో భక్తులు వెళతారు. అక్కడి నుంచి భక్తులపైకి పండ్లు, చాక్లెట్లు, నిమ్మకాయలు, వంటివి విసురుతారు. వాటిని పట్టుకునేందుకు భక్తులు వేలాది మంది తరలివస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మూలస్థానేశ్వరస్వామి సర్వాభరణాలతో విశేష అలంకారంలో, మంగళవాయిద్యాలతో తపస్సుమాను వద్దకు వస్తారని తెలిపారు. అలాగే ధర్మరాజు స్వామి ఆలయం నుంచి అర్జునుడు విశేష అలంకాంరంతో వస్తారని, అక్కడ అర్చకులు ఇరువురు మధ్య యుద్ధ సన్నివేశం ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు, పోలీసు భద్రత, సౌకర్యాలు భారీగా చేశామని తెలిపారు.

ఉన్నవి తీసి.. అడ్డదారిలో పోస్టింగ్‌లు!

• ఇంటర్ బోర్డులో అధికారుల కనికట్టు
• నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు



నెల్లూరు(విద్య), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌బోర్డు వివాదాలకు నిలయంగా మారింది. జిల్లాలో అధికారులు అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా పలువురు అధ్యాపకులకు స్థానం చలనం కలిగింది. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 పోస్టులను, విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోస్టులు తొలగించారు. ఆయా సబ్జెక్టులలో విద్యార్థులు లేని కారణంగా ఈ పోస్టులు తొలగించి విద్యార్థులున్న ప్రాంతాల్లో నియమిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కేఏసీ కళాశాలలో తొలగించిన 2 ప్రభుత్వ తెలుగు అధ్యాపకుల పోస్టుల్లో తిరిగి తెలుగుపోస్టుల్లోనే ఇద్దరు కాంట్రాక్ట్ అధ్యాపకులకు పోస్టింగ్‌లు ఇవ్వడంపై ప్రభుత్వ అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర సబ్జెక్టులలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా తమకు అనుకూరు కోసం నిబంధనలకు విరుద్ధంగా రెండు పోస్టులు సృష్టించి వారి నియామకాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఓ అధికారి, జిల్లాకు చెందిన మరో అధికారి కలిసి ఈ నియామకాల్లో కీలకంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు వెంటనే విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ పోస్టులు తొలగింపుపై కూడా వారు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు.

● కెమిస్ట్రీ బోధకులు లేక...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొన్నింటిలో కెమిస్ట్రీ అధ్యాపకులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అయినవారి కోసం పోస్టులు సృష్టించే అధికారులు, అసలు బోధకులే లేని సబ్జెక్టులకు మాత్రం అధ్యాపకులను ఎందుకు నియమించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేఏసీ కళాశాలలో 170 మందికిపైగా విద్యార్థులకు ఒక కెమిస్ట్రీ లెక్చరర్ ఉన్నారు. ఇక్క మరో అధ్యాపకుడు లేదా గెస్ట్ ఫ్యాకల్టీ అయినా నియమించుకునే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా ఆలోచించలేదు. అలాగే, ఇనమడుగు, కుల్లూరు కళాశాల్లోని అధ్యాపకులు మూడేసి రోజులు చొప్పున కేఏసీ కళాశాలకు వచ్చి కెమెస్ట్రీ బోధిస్తున్నారు. దీనివల్ల ఆయా కళాశాలల్లో వారంలో మూడు రోజులు మాత్రమే కెమిస్ట్రీ బోధన జరుగుతోంది. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, స్వప్రయోజనాల కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవడం వివాదాస్పదంగా మారుతోంది. రాష్ట్ర ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి ఇంటర్ విద్య మనుగడను కాపాడాలని తల్లిదండ్రులు, ప్రభుత్వ అధ్యాపకులు కోరుతున్నారు.

చిత్రజ్యోతి SINCE 1965

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
» అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
» మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
» డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ల 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

» ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
» క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
» పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
» నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
» ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
» సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
» వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.